



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 168 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 11 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-




### రాష్ట్రంపై యుద్ధం ప్రభావం

# తగ్గించేలా చర్యలు

- పౌల్ట్రీ, హార్టీకల్చర్ రంగాల్లో సంక్షోభం తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ
- గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై నిరంతరం ఆరా
- ఉగాదికి 2.50 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు
- సీసీ కెమెరా నెట్వర్క్ ద్వారా నేర నియంత్రణ ప్రణాళిక
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్ యుద్ధ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాలతో ఉన్న అన్ని అంశాలూ ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుందని వాటి వల్ల సంక్షోభం తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మంగళవారం వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్పీజీ, గుడ్లు, అరటి వంటి వాటి ఎలాంటి ప్రభావం ఉందోననే అంశంపై నిరంతరం పరిశీలించాలని సీఎం సూచించారు. యుద్ధ ప్రభావిత దేశాలతో పాటు ఇతర ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విదేశాంగ వ్యవహారాల శాఖతో సంప్రదించి ప్రవాసాంధ్రుల క్షేమంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంతో పాటు ఉన్నతాధికారులు ఓ బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థలు మిగతా .. 2లో..

### ఏపీలో గ్యాస్ కొరత లేదు..

## ఆందోళన వద్దు

### మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎల్పీజీ కొరత లేదని, ప్రజలు అనవసర ఆందోళనకు గురికావొద్దని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. గృహ అవసరాలతోపాటు వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతానికి ఇబ్బందేమీ లేదన్నారు. గ్యాస్ అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇష్టానుసారం మిగతా .. 2లో..

### అఫ్గాన్‌పై వైమానిక

## దాడులు అన్యాయం

### ఐరాసలో భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అఫ్గాన్‌పై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో జరిగే హింస కారణంగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మానవతా వాదం, అంతర్జాతీయ చట్టాలను బాధ్యతాయుతంగా పాటించాలి. పౌరుల రక్షణకు మిగతా .. 2లో..

### 13న రైతుల ఖాతాల్లోకి

## పీఎం కిసాన్ నిధులు




**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. ఈ దఫా మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారు.

### అందుకే ఇరాన్ నౌకలను

## ముంచేస్తున్నాం

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటి వరకు 5వేల లక్ష్యాలను ఛేదించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. తమ మిగతా .. 2లో..

### జీరో హ్యూమన్, యానిమల్ లాస్

## ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ఎండ తీవ్రత, వడగాల్పులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026' ఆవిష్కరణ
- మధ్యాహ్నం 12-4 గంటల మధ్య జరిగే పనులను రీషెడ్యూల్ చేసుకోవాలి
- రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. స్థానిక తాడేపల్లి లోని మంగళవారం ఏపిఎస్డీఎంఏ కార్యాలయంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్స్, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో ఎండ తీవ్రత, వడగాల్పుల సంసిద్ధతపై రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా .. 2లో..

## రైతుల సంక్షేమంలో రాజీ లేదు


- రైతులకు ఎటువంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం చర్యలు
- గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న పరిహారాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది
- యూరియా సరఫరా, ఆర్థిక సహాయంలో ప్రభుత్వం ముందంజ
- ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు, పంటల బీమా సంస్కరణలు
- రైతులకు మద్దతు ధర అమలు... ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కట్టుబాటు
- వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదంటూ వైసీపీ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు. రైతుల సమస్యల విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుండి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మిగతా .. 2లో..

### పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో

## రష్యానే 'విజేత'



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో పశ్చిమాసియా దేశాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి సమయంలో యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు ఈ యుద్ధంలో గెలిచిందెవరైనా ఉన్నారంటే.. అది రష్యా ఒక్కటేనని అన్నారు. యుద్ధం కారణంగా ఇంధన ధరలు మిగతా .. 2లో..

## వినోద, పర్యాటక రంగాల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్

### ముంబయిలో జరుగుతున్న 24వ ఐఏఏపీఐ ఎక్స్ పోలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్
### ఏపీ పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి... భరోసా కల్పించే బాధ్యత మాది అని ఇన్వెస్టర్లకు భరోసా

**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మహారాష్ట్రలోని ముంబయిలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్ లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆధునిక పర్యాటక రంగంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కులు కీలకమైన స్తంభాలుగా ఎదిగిన నేపథ్యంలో కుటుంబాలు వినూత్న అనుభూతుల కోసం, యువత సాహస క్రీడల కోసం , సామాన్య పర్యాటకులు కొత్తదనం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొంటూ అమ్యూజ్‌మెంట్ రంగంలోని జాతీయ,




అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వేలాది ఉద్యోగాలను సృష్టించడం తద్వారా సమాజ జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా మిగతా .. 2లో..

### పోలవరం ఆంధ్రప్రదేశ్

## ఆధునిక దేవాలయం


### పుష్కరాలకు ముందే పూర్తికి సన్నాహాలు
### నాణ్యత విషయంలో రాజీలేదు
### జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు




**పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆధునిక దేవాలయం అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు రాష్ట్రంలో చారిత్రక ఘట్టమైన గోదావరి పుష్కరాలకు ముందే, పోలవరం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.మంగళవారం ఆయన ప్రాజెక్టు పనులను, ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా.. ఇంజనీరింగ్ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం పూర్తి చేయడం ద్వారా ఇటు ఉత్తరాంధ్ర అటు రాయలసీమకు గోదావరి జలాలు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయబోతున్నామని చెప్పారు. ఈ మహా యజ్ఞం ద్వారా రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేయడమే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయంగా ఆయన పేర్కొన్నారు. అలాగే పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామన్నారు. ఇరిగేషన్ రంగానికి మిగతా .. 2లో..

### ఇరాన్‌పై యుద్ధం..
### 48 గంటల్లో ఆయుధాల ఖర్చు

## రూ.51వేల కోట్లు



**విశ్వం వాయిస్ న్యూస్ :** గడిచిన పది రోజులుగా ఇరాన్‌పై అమెరికా భీకర స్థాయిలో దాడులు చేస్తోంది. ఇందుకోసం అత్యాధునిక ఆయుధాలను వాడుతోంది. ఇలా యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే 5.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51వేల కోట్లు) విలువైన ఆయుధ సామగ్రిని అమెరికా వినియోగించినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం వెల్లడించింది. సైనికులు, యుద్ధవిమానాలు లేదా నౌకా దళాలను మిగతా .. 2లో..

## భాజపాతో జగన్ అక్రమ పొత్తు : షర్మిల



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపాతో వైఎస్ జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారని, అందుకే ఉపాధిహామీ పథకంపై మాట్లాడటం లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం భట్నవిల్లి వై.జంక్షన్ వద్ద ఉపాధిహామీ పరిరక్షణ యాత్రలో భాగంగా మంగళవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగన్ మూడు రాజధానుల పేరిట ప్రజలను అయోమయానికి గురి చేశారన్నారు. వీబీ జీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని, లేకుంటే కాంగ్రెస్ అధికారంలోకి మిగతా .. 2లో..

### భూముల వ్యవహారంలో అక్రమాలు జరిగితే

## కఠిన చర్యలు తప్పవు

### రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




**రాయచోటి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ భూములను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చేసిన ఆరోపణలపై మంగళవారం ఆయన స్పందించారు. రైతు భూమి కబ్జా అంశంపై మాజీ మంత్రి బుగ్గన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ఏపీలో గ్యాస్ కొరత లేదు.. ఆందోళన వద్దు

ధరలు పెంచినా, వదంతులు వ్యాప్తి చేసినా.. కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గృహావసరాలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే ప్రాధాన్యం ప్రకారం వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. రోజువారీ అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వల్లో ఏమాత్రం తేడా వచ్చినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ముందుకు వెళ్తామన్నారు.

## దాడులు అన్యాయం

చర్యలు చేపట్టాలనే సెక్రటరీ జనరల్ పిలుపునకు మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం' అని హరీష్ అన్నారు. ఈ సందర్భంగా అఫ్గాన్ భూభాగంపై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇవి అంతర్జాతీయ చట్టాలతో పాటు ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. ఇక, ఇరుదేశాలు సంయమనం పాటించాలని పలు దేశాలు పిలుపునిచ్చినప్పటికీ.. పాక్- అఫ్గాన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సరిహద్దు ఆపరేషన్‌లో అనేకమంది శత్రు సైనికులను హతమార్చామని ఇరువర్గాలు ప్రకటించాయి. ఇదిలాఉండగా.. అఫ్గాన్ సరిహద్దులోని ఉత్తర వజీరిస్తాన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. 18 మంది గాయపడ్డారు.

## రష్యానే 'విజేత'

పెరగడం రష్యాకు అనుకూలిస్తోందన్నారు. బ్రసెల్స్‌లో నిర్వహించిన ఈయూ రాయబారుల సమావేశంలో కోస్టా ఈ విధంగా మాట్లాడారు. "ఇంధన ధరలు పెరగడం ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించడానికి రష్యాకు కొత్త ఆర్థిక వనరుగా మారింది. అదేవిధంగా పశ్చిమాసియా ఉద్రిక్తతలపైనే అందరి దృష్టి ఉండటంతో రష్యాపై కొంత ఒత్తిడి తగ్గుతుంది. పశ్చిమ దేశాలు తమ ఆయుధాలను పశ్చిమాసియాకు మళ్లించాల్సి రావడంతో.. ఉక్రెయిన్‌కు ఆయుధ సాయం తగ్గుతుంది. ఇది కూడా రష్యాకు ప్రయోజనకరమే" అని ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా సవాల్ చేస్తోందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఈయూపై ఉందన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు పశ్చిమాసియాలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే తాటిపైకి రావాల్సి ఉందన్నారు. బాంబుల ద్వారా స్వేచ్ఛ, మానవ హక్కులు సాధించలేమని.. అంతర్జాతీయ చట్టాల ద్వారానే ఇది సాధ్యమన్నారు. ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం కాకుండా చూడాలని.. లేదంటే పశ్చిమాసియా, యూరప్‌తోపాటు ఇతర ప్రాంతాలకూ ముప్పేనని ఆంటోనియా కోస్టా హెచ్చరించారు.

## 48 గంటల్లో ఆయుధాల ఖర్చు రూ.51వేల కోట్లు

మోహరించేందుకు అయిన ఖర్చు దీనికి అదనమని పేర్కొంది. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న యుద్ధం మొదలుపెట్టిన అమెరికా.. గగనతల రక్షణ వ్యవస్థలు, తోమహాక్ క్రూయిజ్ క్షిపణులు సహా వందలాది అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తోంది. ఈ క్రమంలో ఆయుధాల వినియోగంపై ఇటీవల ఓ అంచనాల నివేదిక అమెరికా చట్టసభ ముందుకు వచ్చింది. ఏయే ఆయుధ సామగ్రిని ఎంత మొత్తంలో వినియోగించిందనే వివరాలు బయటకు తెలియనప్పటికీ.. తొలి రెండు రోజుల్లోనే ఉపయోగించిన ఆయుధ సామగ్రి విలువ రూ. 5.6 బిలియన్ డాలర్లు ఉంటుందని కొందరు అధికారులు అంచనా వేశారు. మరోవైపు, పశ్చిమాసియాలో సైనిక ఆపరేషన్లను పర్యవేక్షించే అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం.. ఇప్పటివరకు 5వేల లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇలా ఖరీదైన ఆయుధాలను భారీ సంఖ్యలో వినియోగించడంపై కొందరు చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి వాదనను వైట్‌హౌస్ వర్గాలు తోసిపుచ్చాయి. అధ్యక్షుడి నిర్ణయాలను అమలుచేసేందుకు రక్షణశాఖ సిద్ధంగా ఉందని పెంటగాన్ చీఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. మరోవైపు, ఇరాన్‌లో దాడులను కొనసాగించేందుకు అవసరమైన అనుబంధ బడ్జెట్‌ను కాంగ్రెస్‌కు పంపించే యోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ బడ్జెట్ ప్రతిపాదనపై డెమొక్రాట్‌ల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ముంచేస్తున్నాం

దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందన్నారు. మూడున్నర రోజుల్లో ఆ దేశానికి చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను యూఎస్ మిలిటరీ ముంచేసిందంటూ వెల్లడించారు. ఈ సందర్భంగా సైనిక అధికారులతో జరిగిన సంభాషణను ప్రస్తావించారు. "ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోంది. 46 నౌకలను ముంచేశామంటే నమ్మగలరా..? ఈ విషయంలో మన సైన్యంతీరు నాకు అంతగా నచ్చలేదు. దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడాను. ఆ నౌకలు ఎలాంటివని అడిగాను. అవి అగ్రశ్రేణి నౌకలని చెప్పారు. 'మరి అలాంటప్పుడు స్వాధీనం చేసుకొని మనం వాడుకోవచ్చు కదా..! ఎందుకు ముంచేశారు..?' అని ప్రశ్నించాను. వాటిని ముంచడం సరదాగా ఉందని, అలా చేయడమే సురక్షితమని సమాధానం ఇచ్చారు. నాక్కూడా అది నిజమేనని అనిపించింది. ఇక మన సైన్యం ఇప్పుడు పశ్చిమాసియాకు విహారయాత్రకు వెళ్లింది. కొంత చెడును వదిలిస్తోంది. ఆ యాత్ర కొద్దికాలమే ఉంటుంది. అది మీరు కూడా చూస్తారు. శత్రువును పూర్తిగా ఓడించేవరకు మన మిలిటరీ వెనకడుగు వేయదు" అనిపేర్కొన్నారు.

## ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాల్పుల దృష్ట్యా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026' ను మంత్రి ఆవిష్కరించారు. హీట్ వేవ్ మరణాలు లేకుండా శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణ సంస్థ మరియు ఆర్టీజీఎస్ నుండి అందే వడగాల్పుల హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఒక్క ప్రాణం కూడా వడదెబ్బ వల్ల పోకూడదనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి పనులు చేయకుండా పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడే వారి కోసం ఆసుపత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు మరియు అంబులెన్సులను సిద్ధం చేయాలని వైద్య శాఖను ఆదేశించారు. బస్టాండ్లు, మార్కెట్లు, కూడళ్లు మరియు పర్యాటక ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపుల ద్వారా మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయాలని సూచించారు. ఎండల వల్ల పశువులకు ముప్పు కలగకుండా గ్రామాల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నిరంతరం నింపాలని, పశు గ్రాసం విషయంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే ఎండల దృష్ట్యా గృహ అవసరాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్ డబ్ల్యూ ఎస్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలు మండల, గ్రామ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. దేవాలయాలు, టూరిస్ట్ స్పాట్ల వద్ద త్రాగు నీటి సదుపాయం, మెడికల్ క్యాంపులు నిరంతరం ఉండాలని జిల్లా కలెక్టర్లను మంత్రి అనిత ఆదేశించారు. వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, నీటి కుంటలు వద్ద ఆడుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున అటువంటి చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫైర్ డిపార్టుమెంటు తప్పని సరిగా హాస్పిటల్స్, హోటళ్లు, ప్రవేటు బిల్డింగ్స్ లో వైరింగ్, ఇతర ఫైర్ సేఫ్టీ వంటివి తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్లు ఎండ తీవ్రత జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అలాగే ఎండ తీవ్రత సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లు ప్రచారం చేయాలన్నారు. విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. అందుకు అధికారులు తమ తమ ప్రణాళికలతో గత వేసవి అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధంగా ఉండాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఎస్డీఆర్ఎఫ్ ఐజిపి రాజకుమారి, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఫైర్ డిపార్టమెంట్ అడిషనల్ డైరెక్టర్ జ్ఞానసుందర్, జిల్లాల నుంచి కలెక్టర్లు, డిఆర్వోలు వర్చువల్ గా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమంలో రాజీ లేదు

రైతులు అప్పులపాలై తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరా పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు. అయినప్పటికీ వైసీపీ నేతలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లడమే తమ ప్రధాన పనిగా పెట్టుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు. రైతులకు ఉచిత పంటల భీమా అందిస్తున్నామని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించామని చెప్పారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని, అన్నదాతల అభ్యున్నతే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అలాగే తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సాక్షి పత్రికను ఆయన హెచ్చరించారు.

### రాష్ట్రంలో యూరియా సరఫరా సమర్థవంతంగా

రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా ఎరువుల సరఫరాను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌కు అవసరమైన 6.22 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు ముందుగానే ప్రణాళిక రూపొందించి 8.70 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇందులో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరిగాయని, సుమారు లక్ష మెట్రిక్ టన్నుల నిల్వతో ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రబీ 2025--26 సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం 9.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని చెప్పారు. ఫలితంగా ఇప్పటివరకు 10.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రంలో అందుబాటులో ఉంచి ఫిబ్రవరి నెలాఖరుకే రైతుల అవసరాలను పూర్తిగా తీర్చామని తెలిపారు. గత రబీతో పోల్చితే వరి, మొక్కజొన్న సాగు సుమారు 5 లక్షల హెక్టార్లలో పెరిగినా ఎక్కడా యూరియా కొరత తలెత్తలేదని తెలిపారు. అదేవిధంగా ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు ప్రతి సంవత్సరం కేటాయించే రూ.40 కోట్లకు అదనంగా 2025-26 సంవత్సరానికి మరో రూ.45 కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,489 రైతు సేవా కేంద్రాల నిర్వహణకు 2026-27 సంవత్సరానికి రూ.15.67 కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రస్తుతం సుమారు 70 శాతం యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారానే రైతులకు సరఫరా చేస్తున్నామని మంత్రి వివరించారు.

### అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా రైతులకు అధిక ఆర్థిక సహాయం

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ లో భాగంగా అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా పేరుతో రాష్ట్రం రూ.13,500 ఇస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్రం నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి, కేంద్రం ఇచ్చిన రూ.6,000ను కలిపి మొత్తం రాష్ట్రం ఇచ్చినట్లుగా ప్రకటించారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం కింద అర్హత కలిగిన వెబ్‌ల్యాండ్ భూ యజమానులు, అటవీ భూమి సాగుదారులకు సంవత్సరానికి రూ.20,000 మూడు విడతలుగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో రాష్ట్రం నుంచి రూ.14,000, కేంద్రం నుంచి పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందుతున్నాయని చెప్పారు. భూమిలేని సాగుదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుంచి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం రెండు విడతలుగా అందిస్తున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలుకు రూ.6,300 కోట్లు కేటాయించామని, ఇప్పటికే రెండు విడతలుగా మొత్తం రూ.6,309.44 కోట్లు రైతు కుటుంబాలకు పంపిణీ చేశామని మంత్రి వివరించారు.

## వినోద, పర్యాటక రంగాల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్

కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంలో ఇన్వెస్టర్లకు అందిస్తున్న రాయితీలను తెలుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. మంత్రి దుర్గేష్ స్పీచ్ పై ఇన్వెస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఎక్స్‌పోను ప్రారంభించిన మంత్రి దుర్గేష్ స్టాళ్లను పరిశీలించి ఏపీ పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.పలు స్టాళ్ల వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వినోద సాధనాలను పరిశీలించారు. కార్యక్రమం అనంతరం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా: సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యమైన ప్రకృతి దృశ్యాలు కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ,పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా,ఎలక్ట్రిసిటీ డ్యూటీ రీయింబర్స్‌మెంట్,100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్,ఉపాధి కల్పన ఆధారిత సబ్సిడీలు తదితర భారీ రాయితీలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక భూ కేటాయింపు విధానం: హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ 'టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025'ను దేశంలోనే మొదటిసారిగా ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మంత్రి దుర్గేష్ వివరించారు. రూ. 50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా నేరుగా భూ కేటాయింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047:సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దార్శనికతతో 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ని రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దీని ద్వారా ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. గత ఏడాది కాలంలోనే 102 ఒప్పందాల ద్వారా రూ. 18,448 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని ఆయన వెల్లడించారు. అదనంగా, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ. 9,446 కోట్ల పెట్టుబడితో 7,348 క్లాసిఫైడ్ హోటల్ గదుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. పర్యాటక రాయితీలను పొందడంలో పారదర్శకత, వేగం, ఎటువంటి ఇబ్బందులు లేని ప్రక్రియను నిర్ధారించడానికి పర్యాటక విధానానికి సంబంధించిన 'ఆపరేషనల్ గైడ్‌లైన్స్' విడుదల చేసినట్లు వివరించారు.రాష్ట్రంలో పర్యాటక అనుభవాలను విస్తృతం చేయడానికి కారవాన్ టూరిజం ప్రమోషన్, హోమ్‌స్టే, బి అండ్ బి పాలసీ 2025లను తెచ్చామన్నారు. త్వరలోనే కాన్సర్ట్ పాలసీ, ఏపీ ఫిల్మ్ టూరిజం పాలసీ, మైస్ పాలసీలను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

**టైర్-2, టైర్-3 నగరాల్లో చిన్న తరహా పార్కులు:** రాష్ట్రంలోని చిన్న నగరాల్లో కూడా వినోద అవసరాలు పెరుగుతున్నాయని, అక్కడ చిన్న తరహా అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో త్వరితగతిన రాబడిపొందవచ్చని ఇన్వెస్టర్లకు మంత్రి దుర్గేష్ సూచించారు.

**మౌలిక వసతులు మరియు భరోసా:** ఏపీలో విమానాశ్రయాల విస్తరణ, మెరుగైన రవాణా సౌకర్యాలు, సుదీర్ఘ తీరప్రాంతం, బలమైన హాస్పిటాలిటీ నెట్ వర్క్ పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. "ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి.. మీకు పూర్తి భరోసా కల్పించే బాధ్యత మా కూటమి ప్రభుత్వానిది" అని ఆయన ముంబయి వేదికగా ఇన్వెస్టర్లకు పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రం: భారతదేశంలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం ఐఏఏపీఐ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేష్ అన్నారు. వీరితో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలోని అమ్యూజ్‌మెంట్ పార్కులు, థీమ్ పార్కులు, వాటర్ పార్కులు, ఇండోర్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ల ప్రయోజనాలకు, భద్రతా ప్రమాణాలు, వృత్తిపరమైన శిక్షణ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు , ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రాతినిధ్యం వహించే ఒక అగ్రగామి సంస్థగా కొనియాడారు. IAAPI వంటి అనుభవజ్ఞులైన సంస్థల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి థీమ్ పార్కులను ఏర్పాటు చేసి, పర్యాటకులకు మర్చిపోలేని అనుభూతులను అందించాలని కోరుకుంటున్నానన్నారు.ఆంధ్రప్రదేశ్ కేవలం పర్యాటక ప్రదేశమే కాదు.. పెట్టుబడిదారుల కలల రాష్ట్రమని, అమ్యూజ్‌మెంట్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి కొత్త శోభను, యువతకు ఉపాధిని తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి ఆశయమన్నారు. మాకు కేంద్ర సహకారం మెండుగా ఉందని తెలిపారు. సృజనాత్మకతకు, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమైన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్న మంత్రి దుర్గేష్ వినోద రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఏపీలో వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు, పర్యాటక భవిష్యత్తు నిర్మాణానికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వ ప్రధాన దృష్టి ఆధునికమైన, సుస్థిరమైన,సురక్షితమైన గమ్యస్థానాలను నిర్మించడంపై ఉందని, వినూత్న ఆలోచనలు, అత్యాధునిక సాంకేతికతతో వచ్చే భాగస్వామ్యాలను ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ఆహ్వానిస్తుందన్నారు..అదే విధంగా మెగా పార్కుల నుండి చిన్న తరహా పార్కుల వరకు అపారమైన సామర్థ్యాన్ని వెలికితీయడానికి పరిశ్రమల అధిపతులు, డెవలపర్లు, పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అందిస్తున్న అద్భుత అవకాశాలను పరిశీలించాలని, తమతో భాగస్వాములు కావాలని సాదరంగా ఆహ్వానిస్తూ రండి, రేపటి సంతోషాన్ని నేడే కలిసి నిర్మిద్దామని ప్రసంగాన్ని ముగించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో అమ్యూజ్‌మెంట్ రంగం ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని, 2030 నాటికి ఈ రంగం రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు.. ప్రస్తుతం భారత దేశంలో సుమారు 300 అమ్యూజ్‌మెంట్ పార్కులు, 2,500 ఇండోర్ సెంటర్లు ఉండటం ఈ రంగంపై ప్రజలకు ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందని వివరించారు. ఏపీ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఈ ఎక్స్ పోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఏపీలో ఈ రంగంలో విస్తృత పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్, సీనియర్ కన్సల్టెంట్లు సత్యప్రభ, శివ తదితరులు పాల్గొన్నారు.

## భాజపాతో జగన్ అక్రమ పొత్తు : షర్మిల

వచ్చాక ఆ పని చేస్తుందన్నారు. 150 రోజులు పని కల్పించడంతో పాటు రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతామన్నారు. హస్తం గుర్తును ఆశీర్వదిస్తే రాజశేఖరరెడ్డి పాలనను తిరిగి తీసుకొస్తానన్నారు.

## కఠిన చర్యలు తప్పవు

వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. వైకాపా పాలనలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తమైందన్నారు. తప్పు చేశాననే భయంతోనే సీఎం చంద్రబాబుపై బుగ్గన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మీ భూమి- మీ హక్కు పేరిట రైతుకు న్యాయం చేయడం కోసం సీఎం అధికారులను స్పాట్‌కు పిలవడం బాధ్యతాయుతమైన చర్యగా అభివర్ణించారు. రూ.750 కోట్ల ప్రజా ధనంతో సరిహద్దు రాళ్లపై బొమ్మలు వేసుకున్న చరిత్ర వైకాపా ప్రభుత్వానిదని, ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పాసు పుస్తకాలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు.

### పోలవరం ఆంధ్రప్రదేశ్

## ఆధునిక దేవాలయం

గతంలోనూ, ఇప్పుడు పెద్ద పీట వేసి, అవి పూర్తి అయ్యేలా చేసింది, చేస్తోంది కూటమి ప్రభుత్వమే.. అని ఆయన చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి పనుల నాణ్యత విషయంలో ఎక్కడా, రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని చంద్రబాబు సూచించిన విషయాన్ని రామానాయుడు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం అయింది. దాన్ని సరి చేస్తే సరిపోతుంది అని నిపుణులు చెప్పినా నాణ్యత, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సి డబ్ల్యూ సి డిజైన్స్ ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనలు, ప్రమాణాలు పాటిస్తూ పనులు చేస్తున్నామన్నారు. ఈ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిత్యం పర్యవేక్షిస్తుందని..రామానాయుడు అన్నారు. అలాగే ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియజేస్తున్నట్లు చెప్పారు. కొత్త డయాఫ్రం వాల్ 1372 మీటర్లకు గానూ, 1300 మీటర్లు నేటికి పూర్తయిందన్నారు. ఈ నెలాఖరికి మొత్తం పూర్తవుతుందన్నారు. ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచేలా వైబ్రో కాంప్యాక్షన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. ప్రాజెక్ట్ అనుసంధాన పనుల్లో ముఖ్యమైన కుడి, ఎడమ కాలువలను ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. నిర్వాసితుల నష్టపరిహారానికి సంబంధించి నాడు 2016లో రూ.700 కోట్ల పరిహారం అందించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు దపాలుగా 1900 కోట్లు పంపిణీ చేసి నిర్వాసితులకు అండగా నిలిచారన్నారు. నిర్వాశితులను కొంత మంది మధ్యవర్తులు మీకు మావల్లే పరిహారం అందింది అంటూ మోసం చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందని, మధ్యవర్తుల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నిర్వాసితులు కూడా ఇలా మోసానికి పాల్పడే వారిపట్ల జాగ్రత్త గా ఉండాలని సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణంపై సూచనలు, సలహాలు, విమర్శలు, డిమాండ్స్ వస్తున్నా, వాటిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తామని మంత్రి రామానాయుడు చెప్పారు. ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత పై గాని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన నొక్కి వక్కాణించారు. మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈ ఎన్ సి నరసింహ మూర్తి, ప్రాజెక్ట్ అడ్మిన్ అభిషేక్, మరియు కాంట్రాక్టు ఏజెన్సీ ల ప్రతినిధులు, ఇతర ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంపై యుద్ధ ప్రభావం తగ్గించేలా చర్యలు

అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ సరఫరా, పాఠశాల, ఉన్నత విద్య, ఇసుక సరఫరా లాంటి అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఏడాదిలో విద్యుత్ వినియోగం గరిష్టంగా 14,013 మెగావాట్లకు చేరుకుందని అధికారులు వివరించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి డిస్కంలను ఆదేశించారు. ఈ విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిస్కంలకు సూచించారు. అటు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించిన అంశాల్లో సిలబస్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తరగతి గదులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తృణ ధాన్యాలతో చిక్కీ లాంటి పౌష్టికాహారం అందించే అంశాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

### డీజీసీఏ సహకారంతో డ్రోన్ పైలట్ ట్రైనింగ్ సెంటర్

ఉగాది రోజున 2.50 లక్షల మంది లబ్దిదారుల సామూహిక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేపడుతున్నామని, వారికి ప్రభుత్వం తరపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు అందించేలా అధికారిక లేఖ వెళ్లేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక సరఫరా జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సీఎం సూచించారు. ఇటీవల ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ ఇండియా సమ్మిట్లో కుదుర్చుకున్న ఒప్పందాలు సాకారం అయ్యేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎం లాంటి సంస్థలు ముందుకు వచ్చాయని వచ్చే విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. అటు కాలిబో సంస్థ ఏర్పాటు చేయదలచిన ఏఐ శాండ్ బాక్స్ వచ్చే నాలుగు నెలల్లో స్టార్టప్ ల కోసం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎన్విడియా సంస్థ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో భాగసామ్యం వహించేలా చూడాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకూ సహకారం అందించేలా ఏఐ అగ్రానమిస్ట్, విద్యా బోధనకు సహకారం అందించేలా ఏఐ ట్యూటర్, ప్రాథమికంగా వైద్య సలహాలు అందించేలా ఏఐ డాక్టర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్ ప్రిస్క్రిప్షన్ కూడా యాప్ ద్వారా వచ్చేలా చూడాలన్నారు. సీసీ టీవీ యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సీసీ కెమెరాలను అనుసంధానించి నేర నియంత్రణ చేపట్టేలా చూడాలన్నారు. నేరస్థులను గుర్తించి నేరాలకు అడ్డుకట్టే వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరితగతిన అందుబాటులోకి తేవటంతో పాటు డ్రోన్ ఫ్లైయింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రిమోట్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సహకారంతో అత్యుత్తమ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటీసీ తరహాలోనే డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను కూడా రూపొందించాలన్నారు. వాట్సప్ గవర్నెన్సు వినియోగం మరింత పెంచేలా పౌరులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, గనులు, విద్య, ఆర్థిక, ప్రణాళిక శాఖల అధికారులు హాజరయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## ఇరాన్-ఇజ్రాయిల్ వార్

## ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంచాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు. మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హర్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్దత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్ధత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని,



నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జిల భారం తడిపి మోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## వ్యాన్, ఆటో ఢీకొని.. తల్లి, ఇద్దరు కుమారుల మృతి

**యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలో ఘటన**



**భువనగిరి గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** డీసీఎం వ్యాన్ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందిన విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన డొంకెన కేతమ్మ(56) కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా ఆమె భర్త శ్రీనివాస్ గీత వృత్తి చేస్తున్నారు. వీరికి కుమారులు నరేశ్(35), ఉమేశ్, సురేశ్(28) ఉన్నారు. నరేశ్‌కు మూర్ఛవ్యాధి ఉండటంతో ఇంటి వద్దే ఉండేవాడు. సురేశ్ ఆర్టీసీలో ఒప్పంద డ్రైవర్‌గా పని చేస్తూ.. ఖాళీ సమయంలో సొంత ఆటో కూడా నడిపేవాడు. సోమవారం మధ్యాహ్నం నరేశ్, సురేశ్‌లతో కలిసి తల్లి కేతమ్మ కిరాణా సరకులు తెచ్చేందుకు ఆటోలో భువనగిరి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి నుంచి బీఎన్ తిమ్మాపూర్ వైపు వెళ్లే మార్గంలో ఓ డీసీఎం వ్యాను అతివేగంతో వచ్చి ఎదురుగా ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఇదే సమయంలో వెనుకే వస్తున్న మరో డీసీఎం కూడా నియంత్రణ కోల్పోయి ప్రమాదానికి గురైన వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న సురేశ్‌తోపాటు నరేశ్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలపాలైన కేతమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందారు. వ్యాన్ల డ్రైవర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవీందర్, గ్రామీణ సీఐ చంద్రబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

## పీజీ వైద్య విద్యార్థిని దీపిక కేసులో సీనియర్ అరెస్ట్

**ప్రేమించి, పెళ్లికి తిరస్కరించిన అమర్ సహస్‌రెడ్డి**

**ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు అరెస్ట్.. 14 రోజుల రిమాండ్**



**పటమట, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో గత నెలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అనస్తీషియా పీజీ విద్యార్థిని బత్తుల దీపిక కేసులో ఆమె సీనియర్ డాక్టర్ అమర్ సహస్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అతణ్ని సోమవారం విజయవాడలోని మాచవరం స్టేషన్‌కు పిలిచి, విచారించారు. దీపికను ప్రేమించిన అమర్ పెళ్లికి నిరాకరించి, ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాడని నిర్ధారణకు వచ్చారు. ఆ మేరకు అనుమానాస్పద మృతి నుంచి సెక్షన్ మార్చారు. అనంతరం అరెస్టు చేసి, న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు.

**రెండు గంటల ఫోన్ సంభాషణ:** అనంతపురానికి చెందిన కోదండరామిరెడ్డి, భారతి దంపతుల చిన్న కుమార్తె దీపిక. తిరుపతి వెంకటేశ్వర వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో అనస్తీషియా విభాగంలో పీజీ చివరి ఏడాది చదువుతోంది. గత నెల 5న విధి నిర్వహణలో ఉన్న దీపిక అర్ధరాత్రి ఆసుపత్రి సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లోని ఆపరేషన్ థియేటర్‌లో బెడ్‌పై విగతజీవిగా కనిపించింది. దీనిపై మాచవరం స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. సోమవారం అమర్‌ను పిలిచి విచారించారు. 'పీజీలో దీపికకు సీనియర్ అయిన హైదరాబాద్‌లోని బాచుపల్లికి చెందిన అమర్ సహస్‌రెడ్డితో ఏడాదిగా పరిచయం ఉంది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. మరోవైపు అమర్ విశాఖపట్నంలో గీతమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు తన బ్యాచ్‌మేట్‌ను ప్రేమించాడు. ఇటీవల వారిద్దరూ పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో దీపికను దూరం పెడుతుండటంతో వారిద్దరి మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. పీజీ పూర్తయ్యాక అతను నందిగామలోని ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్నాడు. దీపిక మరణించిన రోజున చివరిగా ఇద్దరి మధ్య రాత్రి 10.40 నుంచి అర్ధరాత్రి 12.30 వరకు ఫోన్ కాల్ నడిచింది. తన పెళ్లి ఖాయమైందని, నిన్ను వివాహం చేసుకోలేనని అమర్ తెగేసి చెప్పాడు. ఒకసారి విజయవాడ రావాలని ఆమె కోరినా తిరస్కరించాడు. దీంతో దీపిక ఆత్మహత్యకు పాల్పడింది' అని విచారణలో తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. రోగికి మత్తు ఇచ్చే సమయంలో కండరాలు రిలాక్స్ అయ్యేందుకు వాడే ఓ ఇంజక్షన్‌ను తీసుకోవడంతో ఆమె మృతి చెందినట్లు ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించింది. పెళ్లికి అమర్ నిరాకరించడంతో.. ఈ ఇంజక్షన్‌ను చేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మరోవైపు దీపిక తండ్రి కోదండరామిరెడ్డి రెండు రోజుల కిందట నందిగామ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి అమర్‌తో మాట్లాడారు. మీ ఇద్దరి మధ్య ఏం జరిగిందని ప్రశ్నించారు. ఓ కేసు విషయమై దీపిక ఫోన్ చేసిందని, అంతకు మించి తనకేం తెలియదని అమర్ చెప్పినట్లు తెలిసింది.

## రోడ్డుపై డ్రైవర్ల ఘర్షణ..

**వెనక నుంచి లారీ ఢీకొని ఇద్దరి మృతి**

**నార్కట్‌పల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఓ లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఆ వాహనాన్ని తాకుతూ ట్రావెల్స్ బస్సు ముందుకెళ్లింది. దీంతో ఇరు వాహనాల డ్రైవర్లు వాహనాలను రోడ్డు పక్కన ఆపి ఘర్షణకు దిగారు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన మరో లారీ వీరిని ఢీకొట్టింది. దీంతో రెండు లారీల మధ్య ఇరుక్కుపోయి ఇద్దరు డ్రైవర్లు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతులను శ్రీనివాస్, బంగారయ్యగా గుర్తించారు.

## రూ.1.7 లక్షలకు పొత్తిళ్లలో శిశువు విక్రయం

**మెదక్ జిల్లా లింగసానిపల్లి తండాలో ఘటన**



**హవేలిఘనపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లి పొత్తిళ్లలోని శిశువును ఓ గిరిజన కుటుంబం రూ.1.70 లక్షలకు విక్రయించిన ఘటన మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండలం లింగసానిపల్లి తండాలో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. స్థానికులు, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. లింగసానిపల్లి తండాకు చెందిన ఓ గిరిజన మహిళ గత నెల 10న మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. వారం తర్వాత ఆ శిశువును కామారెడ్డికి చెందిన ఓ దంపతులకు రూ.1.7 లక్షలకు విక్రయించినట్లు సమాచారం. అప్పటి నుంచి సదరు మహిళ అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు, ఆహారం తీసుకునేందుకు రాకపోవడంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలికి అనుమానం వచ్చింది. ఆమె ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. సోమవారం సదరు మహిళ, ఆమె భర్త చేగుంటలో తండాకు చెందిన వారికి కనిపించారు. వెంటనే ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అక్కడికి చేరుకొని వారిని హవేలిఘనపూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఠాణాలో విచారించగా అసలు విషయం తేలింది.

## నాటు తుపాకీ పేలి బాలుడి మృతి

**స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ఘటన**



**ఎలమంచిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్నేహితులందరూ కలిసి నాటు తుపాకీతో ఆడుకుంటుండగా ఒక్కసారిగా అది పేలి బాలుడు మృతిచెందిన ఘటన అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకొంది. కాకినాడ జిల్లా తునికి చెందిన ఆడారి కౌశిక్(12) ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో ఇదే గ్రామానికి చెందిన ఏడుగురు స్నేహితులతో పోలవరం కాలువ వద్దకు వెళ్లారు. వీరిలో ఒక బాలుడు అక్కడే ఉన్న తన ఇంట్లోకి వెళ్లి నాటు తుపాకీ తీసుకురాగా అందరూ దాంతో ఆటలాడటం మొదలుపెట్టారు. అంతలోనే తుపాకీ మిస్‌ఫైర్ అయి బుల్లెట్ కౌశిక్‌కు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. మిగిలిన బాలురలో ఐదుగురు భయపడి అక్కడి నుంచి పారిపోగా.. తుపాకీ తీసుకొచ్చిన బాలుడు ఈ విషయాన్ని తన తండ్రికి తెలియజేశాడు. అతను ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కాల్వ ఒడ్డున పడేశాడు. బాలుడి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పారిపోయిన ఐదుగురిలో మరొక బాలుడికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. నాటు తుపాకీ తీసుకొచ్చిన బాలుడి తండ్రికి అది ఎక్కడ నుంచి వచ్చింది? ఎప్పటి నుంచి వినియోగిస్తున్నారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి విచారిస్తున్నట్లు ఎలమంచిలి సీఐ ధనుంజయరావు తెలిపారు.

## కార్మికులపై బోల్తా పడిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అంబేద్కర్ నగర్‌లోని మిలీనియం పాఠశాల సమీపంలో ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి చెట్టును ఢీకొట్టింది. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రదీప్, రవి అనే ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి.

# ఏఐ కోర్సులు చేస్తారా? ఉచితంగా అందించే వేదికలెన్నో..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారు మోగుతోన్న పేరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). అన్ని రంగాల్లోనూ దీని ప్రాధాన్యం పెరుగుతోంది. నియామకాల్లో ఏఐ ప్రావీణ్యం ఉన్నవారిని ఎంపిక చేసుకోవడానికి సంస్థలూ ఆసక్తి చూపుతున్నాయి. అన్ని రంగాల్లోనూ దీన్ని విస్తృతంగా ఉపయోగించడమే దీనికి కారణం. అందువల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు ఏఐలో అవగాహన పెంచుకుంటే కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. ఎన్నో వేదికల ద్వారా ఇప్పుడు ఏఐను ఎక్కడ నుంచైనా నేర్చుకోవచ్చు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఏఐ, మెషీన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ లాంటి అంశాలపై అవగాహన ఉండటం భవిష్యత్తు ఉద్యోగాలకు చాలా ఉపయోగం. ఉద్యోగాలు, పరిశోధనలు, స్టార్టప్‌లు అన్నీ ఏఐ ఆధారితంగానే ముందుకు సాగుతున్నాయి. అందువల్ల ఈ టెక్నాలజీ గురించి నేర్చుకోవడం తప్పనిసరి. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు, విశ్వవిద్యాలయాలు కొన్ని ఏఐ కోర్సులను ఉచితంగా అందిస్తున్నాయి.

**జనరేటివ్ ఏఐ**

జనరేటివ్ ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. టెక్ట్స్ రాయడం, కోడ్ జనరేట్ చేయడం, చాట్‌బాట్స్ రూపొందించడం, సంగీతం, చిత్రాలు లాంటి కొత్త కంటెంట్‌ను సృష్టించే సామర్థ్యం ఈ టెక్నాలజీకి ఉంది. విద్యార్థులు, ఉద్యోగార్థులు భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే జనరేటివ్ ఏఐ గురించి అవగాహన ఉండాలి. గూగుల్ క్లౌడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో ఈ కోర్సును ఉచితంగా నేర్చుకోవచ్చు. ప్రాక్టికల్ ల్యాబ్స్, ప్రాజెక్ట్స్ ద్వారా నేర్చుకునే వీలుంది. రియల్ టైమ్ ల్యాబ్స్ ద్వారా ప్రత్యక్ష అనుభవం, కోర్సు పూర్తిచేసిన తర్వాత సర్టిఫికెట్ పొందవచ్చు. ఈ టెక్నాలజీ విద్య, ఆరోగ్యం, మీడియా, వ్యాపారం లాంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది.

**ఏఐ ఫర్ బిగినర్స్**

ఏఐ గురించి నేర్చుకోవడానికి రూపొందించిన ప్రారంభ స్థాయి కోర్సు ఏఐ ఫర్ బిగినర్స్. ఇందులో ఏఐ అంటే ఏమిటి, అది ఎలా పనిచేస్తుంది, మెషీన్ లెర్నింగ్ బేసిక్స్, ప్రాక్టికల్ జనరేటివ్ ఏఐ ఉపయోగాలు తదితర అంశాల గురించి నేర్చుకోవచ్చు.




ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐబీఎమ్ ఈ కోర్సును రూపొందించింది. దీన్ని కోర్సెరా, మైక్రోసాఫ్ట్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందిస్తోంది. ఎలాంటి ఫీజు లేకుండా, సులభంగా ప్రాక్టికల్ ఉదాహరణలతో నేర్చుకునే అవకాశం కల్పిస్తోంది.

**రోబోటిక్స్/ మెషీన్ లెర్నింగ్**

మెషీన్ లెర్నింగ్‌లో అల్గారిథమ్స్, సిస్టమ్స్ థింకింగ్, ఏఐ సూత్రాలను బోధిస్తారు. ఏఐ పరిశోధన లేదా డెవలప్‌మెంట్ రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణ అందిస్తోంది.

**యువ ఏఐ ఫర్ ఆల్**

భారత ప్రభుత్వం ప్రారంభించిన యువ ఏఐ ఫర్ ఆల్ ఉచితంగా నేర్చుకునే ఆన్‌లైన్ కోర్సు. దీన్ని పూర్తి చేసినవారు ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పొందుతారు. ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్, ఐజీఓటీ కర్మయోగి లాంటి ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో, స్వయం పోర్టల్ ద్వారా ఏఐ కోర్సులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.

**ఎన్నో సంస్థలు**

హార్వర్డ్, ఎమ్ఐటీ, ఐఐటీ మద్రాస్, కాలిఫోర్నియా యూనివర్సిటీలు ఏఐ కోర్సులు ఉచితంగా అందిస్తున్నాయి. ఎలాంటి సాంకేతిక నేపథ్యం అవసరం లేకుండా ప్రారంభ స్థాయి నుంచే పైతాన్, ఏఐ మెషీన్ లెర్నింగ్ నేర్చుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ సంస్థల్లో కొలువులు ఆశించేవారికి ఈ కోర్సులు ఉపయోగపడతాయి. విద్యార్థులు ముందుగా ప్రాథమిక కోర్సులతో అధ్యయనం ప్రారంభించాలి. పైతాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకోవడం, చిన్న చిన్న ప్రాజెక్టులు చేసి అనుభవాలు పెంచుకోవాలి. ఆన్‌లైన్ కోర్సులతో పాటు పుస్తకాలూ చదువుతుండాలి. ఈరోజు నేర్చుకున్న ఏఐ నైపుణ్యాలు రేపటి కెరియర్‌కు బలమైన పునాదులు అవుతాయి. సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణ, ఆసక్తులతో చదివితే విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇక్కడ కొన్ని ప్లాట్‌ఫామ్‌లు సర్టిఫికెట్ కోసం కొద్ది మొత్తంలో ఫీజు తీసుకోవచ్చు. స్వయం వేదికగా పెద్ద సంఖ్యలో ఏఐ కోర్సులను ఉచితంగా నేర్చుకోవచ్చు. వీటిని ఐఐటీలు, ఐఐఎస్సీ ప్రొఫెసర్లు రూపొందించారు. సీబీఎస్ఈ 11, 12 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఏఐ పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక సమాచారం క్షుణ్నంగా తెలుసుకోవచ్చు. వీటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం ఉంది.

**ఎలిమెంట్స్ ఆఫ్ ఏఐ**

టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ లేని విద్యార్థుల కోసం హెల్సింకి యూనివర్సిటీ ఎలిమెంట్స్ ఆఫ్ ఏఐ కోర్సును ఉచితంగా అందిస్తోంది. ఇందులో కోడింగ్ అవసరం లేకుండానే ఏఐ గురించి నేర్చుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా ఈ కోర్సు పూర్తి చేయవచ్చు. ఏఐ ఎలా పనిచేస్తుంది, దాని వల్ల ఉద్యోగాలు, సమాజం, నైతిక సమస్యలు ఎలా ప్రభావితం అవుతాయి మొదలైన విషయాల గురించీ తెలుసుకోవచ్చు.

కాసులకు కక్కుర్తి పడి వృత్తికి

## ద్రోహం చేస్తున్న అటవీ శాఖ అధికారిణి

**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** జీవరాశికి ప్రాణ వాయువు అందించడానికి అడవులు దోహద పడతాయి అలాగే ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, పిసా చట్టాలు అమలులో ఉంటాయి. అయినప్పటికీ అడవులను, వృక్ష సంపదను కంటికి రెప్పలా కాపాడవలసిన సంబంధిత శాఖ అధికారే కలప వ్యాపారి దగ్గర డబ్బులకు కక్కుర్తి పడి తానే దగ్గర ఉండి కలపను తరలించడం దేవీపట్నం మండలంతో పోలవరం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది.



వ్యాపారస్థులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ బీట్ అధికారిణి

వివరాలలోకి వెళ్తే పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ పరిధిలో గల పోతవరం బీట్ చాపరాల పల్లి గ్రామ సమీపంలో కోరుకొండ మండలం బొల్లె ద్దుపాలెం గ్రామానికి చెం దిన కలప వ్యాపారి రెండు రోజులుగా మారిజాతి కలపను మైదాన ప్రాంతానికి తరిస్తున్నాడు. అయితే విషయం తెలుసుకున్న సంబంధిత బీట్ అధికారిణి కలపను తరలి స్తున్న ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్నటు వంటి వ్యాపారి వద్ద కాసేపు హంగామా నడిపించి వ్యాపారి వద్ద కొంత నగదు తీసుకుని చూసి చూడనట్టు వ్యవహరించిన తీరు పట్ల విమర్శలు ఎదుర వుతున్నాయి.





అడవులకు వృక్ష సంపదను కాపాడవలసిన అధికారులే ఇలా దగ్గర ఉండి కలప వ్యారస్థులకు సహకరిస్తుంటే అడవులను రక్షించేది ఎవరు. గతం లో ఇదే మండలంలో ఉన్న దేవారం బీట్ అధికారిణి కూడా వ్యాపారిని లంచం డిమాండ్ చేస్తూ ఉన్న వీడియో అధికారుల దృష్టికి వెళ్లడంతో ఆమెను సస్పెండ్ చేశారు. అయినప్పటికీ ఇటువంటి వారిలో మార్పు కనపడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలి.

## కాలం చెల్లిన ఆహార పదార్థాలు పెడితే చర్యలు తప్పవు

**గుడ్లు నాణ్యత లేకపోతే గుత్తేదారులపై చర్యలు తప్పవు - ఉన్నతాధికారుల దృష్టికి మెనూ సమస్యలు**
**పోతవరం ఎంపీపీ పాఠశాలలో పాడైపోయిన గుడ్లు వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**




**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల మెనూలో ఎలాంటి లోపాలు ఉన్నా సహించేది లేదని రంపచోడవరం ఎమ్మెల్యే ,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. దేవీపట్నం మండలంలో ఆమె మంగళవారం పలు పాఠశాలలు, వసతి గృహాలపై సుడిగాలి పర్యటన చేశారు. దేవీపట్నం మండలం పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఆ పాఠశాలలో పాడైపోయిన గుడ్లు విద్యార్థులకు అందించిన సంఘటన పై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించి వాస్తవంగా రికార్డు ప్రకారం 181 గుడ్లు ఉండాల్సి ఉండగా తేడా ఉన్నట్లు గుర్తించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ దొర, వంటమనిషి రామలక్ష్మిలకు హెచ్చరిక జారీ చేశారు. గుత్తేదారులు సకాలంలో అందించే పూర్తి నాణ్యతతో ఉన్న సరుకులు మాత్రమే తీసుకోవాలన్నారు. ఒకవేళ గుత్తేదారులు నాణ్యత లేని సరకులు సరఫరా చేస్తే తిరస్కరించాలన్నారు. అలా కాని పక్షంలో నిర్లక్ష్యం ఎవరిదైతే ఉందో వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అన్ని రకాల పదార్థాలు తనిఖీ చేసి పరిశీలించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు పెట్టొద్దని సూచించారు. దీనిపై ఐటిడిఎ పిఓ , జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. గుత్తేదారుల్ని కూడా అవసరం అయితే మార్చడానికి ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. అనంతరం దామనపల్లి ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తీర్ణత శాతం పెంపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలోని పలు సమస్యలు కోతులు సమస్య ఉందని, క్రీడా మైదానం లెవెలింగ్ చేయాలని, ప్రహరీ గోడలపై పెన్సింగ్ సదుపాయం కల్పించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆమె



పరిష్కారం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసిల్దార్ కె.సత్యనారాయణ, సహాయ గిరిజన సంక్షేమ అధికారి జల్లి శంభుడు, ప్రధానోపాధ్యాయురాలు బి.చంద్రకళ, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముంద్రు మధుసూధనరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగాధర రావు, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ కుమార్, ఏఎంసి డైరెక్టర్ జొన్నల రాంబాబు, క్లస్టర్ ఇంచార్జి ఎమ్.వీర వెంకట సత్యనారాయణ , రేలంగి రాంబాబు, పుట్టపల్లి మల్లేష్, నాగేశ్వరరావు , దబ్బ నాని అధిక సంఖ్యలో కూటమి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి : ఎంఈఓ నాయుడు రామచంద్రరావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్నట్టు మండపేట మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపేట, మండలంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. మండపేట టౌన్, రూరల్ నుంచి 1815 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. మండపేట రూరల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల నుండి 259 మంది అబ్బాయిలు, 243 మంది అమ్మాయిలు కలిపి 502 మంది, ప్రైవేట్ పాఠశాలల నుండి 237 మంది అబ్బాయిలు, 244 మంది అమ్మాయిలు కలిపి 481 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. మండపేట అర్బన్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల నుండి 141 మంది అబ్బాయిలు, 198 మంది అమ్మాయిలు కలిపి 339 మంది, ప్రైవేట్ పాఠశాలల నుండి 252 మంది అబ్బాయిలు, 241 మంది అమ్మాయిలు కలిపి 493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అర్బన్‌లో 4 కేంద్రాలు, రూరల్‌లో 5 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్బన్ లో ఎస్.వి.ఎస్.ఆర్ ప్రభుత్వ హైస్కూల్, పి.ఎస్.సి.ఎం జడ్.పి.జి హైస్కూల్, సెయింట్ అన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, భాష్యం స్కూల్ లలో నిర్వహిస్తు న్నామన్నారు. రూరల్ ప్రాంతంలో ఏడిద జిల్లా పరిషత్ హై స్కూల్, తాపేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్, చైతన్య స్కూల్ లోను, ద్వారపూడి జిల్లా పరిషత్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 40 నిమిషాల వరకు జరగనున్నట్టు వివరించారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థిని విద్యార్థులు అందరూ ఒక గంట ముందుగా హాజరు కావాలని తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులు స్కూల్ యూనిఫామ్ ధరించి పరీక్షా కేంద్రాలకు హాజరు కాకూడదని, సివిల్ డ్రెస్ లో మాత్రమే పరీక్షలకు హాజరుకావాలని ఆయన చెప్పారు.

## మహిళా సాధికారతకు కృషి చేసిన గెల్లా కేశవకు సత్కారం

**– స్త్రీల పట్ల మరింత బాధ్యతతో సమాజానికి కృషి చేస్తా**




**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో కొంతమంది మహిళలకు, ప్రముఖులకు మహిళా సాధికారతకు కృషి చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు గెల్లా కేశవకు హైదరాబాదు బిర్లా సైన్స్ సెంటర్ భాస్కర ఆడిటోరియంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా మహిళా సాధికారత అత్యంత పురస్కారాన్ని అందుకుంటున్నట్లు బిజెపి రాష్ట్ర నాయకులు గెల్లా కేశవ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ స్త్రీ లేకపోతే సృష్టి లేదని జీవితమే లేదని వివరణ చేసి జీకే ఎడ్యుకేషనల్ అకాడమీ ద్వారా విద్య, వైద్య,న్యాయ రంగాల్లో సేవలు అందించి స్త్రీలు ఆర్థికంగా స్థిరపడడానికి సాధికారతకు కృషి చేసినందుకు అవార్డు దక్కిందని ఈ పురస్కారం పొందడం వల్ల సమాజం పట్ల స్త్రీల పట్ల మరింత బాధ్యతతో సమాజానికి కృషి చేస్తానని పాన్ ఇండియా సంస్థ కు అభినందనలు తెలిపారు.

## రాజమండ్రి టౌన్ ప్లానింగ్‌లో ఏసీబీ ఆకస్మిక సోదాలు

**– అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పలు రికార్డుల పరిశీలన**
**– కీలకపత్రాలు, ఫైళ్ళు స్వాధీనం?**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరపాలక సంస్థ (ఆర్ ఎంసీ)లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పలు రికార్డులను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీలు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల్లో మంగళవారం తనిఖీలు చేస్తున్నారు.ఏసీబీ డీజీ అతుల్ సింగ్, ఏసీబీ డైరెక్టర్ జయలక్ష్మి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్‌లోని వివిధ విభాగాల్లో అవినీతి చోటు చేసుకుంటున్నాయని కొంతకాలంగా ఫిర్యాదులు వివిధ వేదికల ద్వారా ఏసీబీ దృష్టికి వెళ్ళాయి.అంటే ప్రజల నుంచి సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు,వివిధ పత్రిక కథనాలు రావడంతో అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది.. ఉదయం నుంచి ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఏవైనా రూల్స్ డీవియేషన్స్ ఉన్నాయా? అనే విషయాన్ని సైతం అధికారులు పరిశీలించడం గమనార్హం. అన్ని నిబంధనల ప్రకారం నిర్మాణాలు ఉన్నాయా? లేవా? అనేది ఫీల్డ్‌లోకి సైతం వెళ్లి చూడాల్సి ఉంటుందని అంటున్నారు. కీలక పత్రాలు,ఫైళ్ళు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులను ప్రశ్నిస్తున్నారు.అక్రమ కట్టడాలకు అనుమతులు, పెండింగ్ ఫైళ్ళు పరిశీలిస్తున్నారని సమాచారం.. వీటిపై లభించిన ఆధారాలను బట్టి తదుపరి చర్యలను ఏసీబీ ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

రాజమండ్రి రూరల్, అర్బన్ ప్రాంతాల్లో

## ఫుడ్ కమిషన్ ఆకస్మిక తనిఖీలు

**విద్యార్థులకు పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి - రేషన్ సరుకుల పంపిణీలో తూకం ఖచ్చితత్వం తప్పనిసరి**
**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాలా దేవి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాలా దేవి మంగళవారం రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ పరిధిలో సంక్షేమ వసతి గృహాలు, మధ్యాహ్న భోజన పథకం, ఎమ్ ఎస్ ఎల్ పాయింట్స్, చౌక ధరల దుకాణాన్ని విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మూరు రూరల్ పరిధిలోని రెండు ఎఫ్‌పి షాపులు, మూడు ఐసీడీఎస్ కేంద్రాలు, జడ్పీహెచ్ స్కూల్, ఎంపీపీ స్కూల్, ఎంఎల్ఎస్ పాయింట్ బొమ్మూరు, అలాగే రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్ (గర్ల్స్), ధవలేశ్వరం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (గర్ల్స్), ఎర్రకొండ గ్రామంలోని జడ్పీహెచ్ స్కూల్‌లను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం, అల్పాహారం, వసతి గృహాల్లో అందజేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు సరైన పోషకాహారం అందు తున్నదా లేదా అనే విషయంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు క్రమం తప్పకుండా అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. వంటలు చేస్తున్న క్రమంలో చక్కగా ఆహార పదార్థాలు ఉడికేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. అలాగే బొమ్మూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను కూడా తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉంచిన ధాన్యాల నాణ్యత, బరువు ప్రమాణాలు, పంపిణీ విధానంపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన ఆహార ధాన్యాలు అందేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలలు, వసతి గృహాలు,




ఐసీడీఎస్ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని గంజిమాలా దేవి పేర్కొన్నారు. తనిఖీల అనంతరం లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయంలో తూకం విషయంలో ఖచ్చితత్వం పాటించడం అత్యంత అవసరమని ఫుడ్ కమిషన్ సభ్యురాలు పేర్కొన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి తేడాలు లేకుండా నిర్ణీత బరువుకు తగ్గట్టుగా సరుకులు అందించాలని దుకాణ డీలర్లకు సూచించారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సరుకులు అందేలా పారదర్శకంగా పంపిణీ చేయాలని, తూకం పరికరాలు సరిగా పనిచేసేలా తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాణ్యతతో పాటు పరిమాణం విషయంలో కూడా ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటన నేపథ్యంలో ఫుడ్ కమిషన్ సభ్యురాలు వెంట జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి.శ్రీదేవి, డిఎస్‌వో వి.పార్వతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్ జ్యోతి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు బి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో జాతరను నిర్వహించాలి

**రూరల్ సిఐ దొరరాజు**



**మండపేట మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ద్వారపూడిలో శ్రీ రాజ్యలక్ష్మి బంగారమ్మ తల్లి వారి జాతర తీర్థం ప్రశాంతంగా నిర్వహించాలని మండపేట రూరల్ సిఐ దొరరాజు పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకుని దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఉత్సవ కమిటీ వారికి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.శాంతియుతంగా భక్తి భావంతో జాతర తీర్థం జరపాలని విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం ఆర్కెస్ట్రా లాంటి వినోద కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు ఉంచకూడదని ఆదేశించారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని కోరారు.బాణాసంచా మందు గుండు సామాగ్రి బాణసంచా కాల్చరాదన్నారు.గ్రామమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జాతర బందోబస్తుకు సుమారు 30 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూపు దేవస్థానాల చైర్మన్లు పోకల నాన్నాజి, రంబాల చక్రరావు, నక్కా శ్రీనివాసరావు, దేవాదాయశాఖ ఈవో ఉండమట్ల రాజేష్, సొసైటీ అధ్యక్షులు సలాది బాలసుబ్రహ్మణ్యం, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, బిజెపి నాయకులు కంకటాల మురళీకృష్ణ, జనసేన నాయకులు చింతా దొరబాబు, అడబాల బుల్లబ్బులు, పల్ల సన్యాసిరావు, లక్ష్మీ వీరభద్రరావు, వర్రే వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

బుధవారం, 11 మార్చి 2026
www.viswamvoice.com





# కోనసీమలో గ్యాస్ కొరత లేదు

### జాయింట్ కలెక్టర్ నిశాంతి స్పష్టం



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై సామాజిక మాధ్యమాల్లో కొన్ని అపోహలు వ్యాప్తి చెందుతున్నాయని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలియజేస్తూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ కొరత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదని తెలిపారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో కోనసీమ జిల్లాకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదా కొరత లేదని, సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వరుసగా ఆన్లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని, వినియోగదారులు కేవలం 21 రోజుల గడువులోనే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి నిలుపుదల ఉండదని ఆమె స్పష్టం చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ సరఫరా నిలిపివేశారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. మంగళవారం గ్యాస్ బుకింగ్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొంతసేపు బుకింగ్‌లు నిలిచిపోయాయని, ప్రస్తుతం పోర్టల్ యథావిధిగా పనిచేస్తోందని తెలిపారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయరాదని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం, జిల్లా పరిపాలన పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి కోరారు.

### శ్రీ ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం భవనానికి

# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో 2027వ సంవత్సరం గోదావరి పుష్కర నిధులు రూ.1కోటితో నిర్మించనున్న శ్రీ ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,వానపల్లి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మద్దింశెట్టి ఆదినారాయణ, సభ్యులు, ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం పాలకమండలి చైర్మన్ గోపిశెట్టి సత్యనారాయణ,సభ్యులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాజ్యసభ స్థానాలను

# మళ్లీ బీసీలకే కేటాయించాలి

### టీడీపీ యువ నాయకులు బొక్కా ప్రసాద్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్‌లో గతంలో బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ కేటాయించిన రాజ్యసభ స్థానాలు ప్రస్తుతం ఇతర వర్గాలకు ఇవ్వబడుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువనాయకులు బొక్కా ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో నిజమైన సామాజిక న్యాయం అమలు కావాలంటే బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.బీసీ సామాజిక వర్గాల అభివృద్ధిలో ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ స్థానం ప్రత్యేకమని ఆయన అన్నారు. బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, బీసీ రక్షణ చట్టం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ నాంది పలికిందని అన్నారు గతంలో బీసీలకు కేటాయించిన రాజ్యసభ స్థానాలను మళ్లీ అదే వర్గాలకు కేటాయించడం ద్వారా వారి రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభుత్వం కొనసాగించాలని ఆయన కోరారు. కూటమి పొత్తు కారణంగా కొంతమంది బీసీ నాయకులు తమ సీట్లను త్యాగం చేసిన విషయం తెలిసిందే అని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీ వర్గాలు అధిక శాతం ఉన్నప్పటికీ వారికి రాజకీయ అవకాశాలు తక్కువగా లభిస్తున్నాయని ఆయన అన్నారు. త్వరలో ఖాళీ కానున్న పిల్లి సుభాష్ చంద్ర బోస్ రాజ్యసభ స్థానాన్ని మళ్లీ బీసీ వర్గానికే కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని బొక్కా ప్రసాద్ కోరారు.సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాల కోసం ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని బీసీ వర్గాల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వాడపాలెం గ్రామదేవత మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపాలెం గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బండారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం మనందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం మారెమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

### వానపల్లిలో రూ.1.53 కోట్ల

# అభివృద్ధి పనులకు శ్రీకారం కొత్తపేట ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.ఆయన వానపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వానపల్లి పళ్ళాలమ్మ అమ్మవారి ఆలయంలో సీజీఎఫ్ నిధులు రూ.18.67 లక్షలు, గ్రామస్తుల విరాళాలు రూ.9.33 లక్షలు కలిపి మొత్తం రూ.28 లక్షలతో నిర్మించనున్న దేవాలయ ప్రాకార గోడకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం సీజీఎఫ్ నిధులు రూ.85 లక్షలతో నిర్మించిన ప్రాకార మండపాన్ని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను అభినందించారు. ఆలయం వద్ద రహదారి వెడల్పు, ఇన్ గేట్, ఔట్ గేట్ నిర్మాణ పనులను కూడా చేపడతామని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడకు వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి ప్రహరీ గోడ, షెడ్లు, పార్కు నిర్మాణం చేయాలని సూచించారని చెప్పారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు.పుష్కరాల నేపథ్యంలో నియోజకవర్గంలోని పుష్కర ఘాట్లు, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.వానపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన రహదారి మరమ్మతు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

### క్లస్టర్ శిక్షణ తరగతుల్లో

# పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం దిశానిర్దేశం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్యకర్తలే పార్టీ బలం.వారి కృషితోనే పార్టీ అభివృద్ధి సూపర్ సిక్స్, సూపర్ హిట్ పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషి, అంకితభావం ఎంతో కీలకమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 175 నియోజకవర్గాల క్లస్టర్ల శిక్షణ తరగతుల్లో పాల్గొని ఆయన క్లస్టర్ సభ్యులకు పలు సూచనలు చేశారు. పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా క్లస్టర్ సభ్యులు పనిచేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుంచే ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా భావిస్తూ పనిచేస్తోందన్నారు. తక్కువ ధరకు బియ్యం అందించే పథకం,పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న ఘనత టీడీపీదేనని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్ వేసిన పునాదులు నేటికీ రాష్ట్ర అభివృద్ధికి దారితీస్తున్నాయని తెలిపారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. ఇందులో భాగంగా తల్లికి వందనం ద్వారా తల్లుల ఆర్థిక భద్రతకు తోడ్పాటు అందించడమే లక్ష్యమని చెప్పారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. మహిళా సాధికారత కోసం శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రోత్సాహం కల్పించడమే కాకుండా, కుటుంబాలకు మేలు చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అలాగే పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దీపం 2.0 పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ కల్పించనున్నట్లు చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో యువగళం కార్యక్రమం ద్వారా యువతకు ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాలికల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆడబిడ్డ నిధి వంటి పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమని వివరించారు.ఈ పథకాల గురించి ప్రజలకు స్పష్టంగా వివరించడం ప్రతి క్లస్టర్ సభ్యుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అంకితభావంతో ముందుకు వచ్చిన కార్యకర్తల పాత్ర అమూల్యమని అన్నారు. "కార్యకర్తలే పార్టీకి అసలైన బలం.వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీమా వంటి సదుపాయాలు కల్పించిన పార్టీ టీడీపీ మాత్రమే" అని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దృష్టి, నారా లోకేష్ యువ నాయకత్వం అవసరమని ఆయన తెలిపారు. ప్రతి క్లస్టర్ సభ్యుడు ఒక కార్యకర్తగా భావించి ప్రజల్లో చురుకుగా పని చేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో క్లస్టర్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సూచనలను శ్రద్ధగా వినిపించారు. పార్టీ బలోపేతానికి ఈ తరగతులు ఎంతో దోహదపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

# జల జీవన్ మిషన్‌తో గ్రామాలకు జీవనాడి

### రూ.34.30 లక్షలతో మంచినీరు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కె .గంగవరం మండలం శివల గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద రూ. 34.30 లక్షలతో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మంగళవారం శంకుస్థాపన చేశారు. మండల ప్రజా పరిషత్ అధికారి ఎం. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మహత్తర కార్యక్రమమని అన్నారు. శివల గ్రామంలో నిర్మించబోయే ఈ వాటర్ ట్యాంక్ పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక దృష్టి సారి స్తున్నారని , ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ అధికారులు, డీసీ నిడదవోలు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, బీసీ సెల్ మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేంద్ర, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, నిడదవోలు రవి, కాకి అప్పారావు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు లోకేష్ కృషి అమోఘం

### అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

అల్లవరం మండలం తూర్పులంక గ్రామంలో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రజలకు అంకితం చేయడంతో పాటు ఎంపీపీ పాఠశాల నూతన భవనాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని సుమారు 63 లక్షల మంది విద్యార్థుల్లో సగానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని పేర్కొన్నారు. వారికి నాణ్యమైన యూనిఫామ్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పేరెంట్, టీచర్ సమావేశాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని వివరించారు. విద్యాశాఖను ఆధునికీకరించడమే కాకుండా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని అన్నారు. మంచినీటి సమస్య పరిష్కారంపై మాట్లాడిన ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రతి ప్రాంతానికి రక్షిత మంచినీరు అందించే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. మొదటి విడతలో గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయని, రెండో విడతలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలను కూడా చేర్చినట్లు తెలిపారు. రాబోయే పది నెలల్లో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సంపూర్ణంగా మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తూర్పులంక గ్రామంలో రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్న ఆయన, గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని

# పరిశీలించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకూరు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఖండవిల్లి భరత్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం అందుతున్న ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అంగన్వాడి కేంద్రాలను

# ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా విజిలెన్స్ కమిటీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ (జిల్లా పౌర సరఫరాల) కమిటీ సభ్యుడు ఖండవిల్లి భరత్ కుమార్ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ.ఉదయ భాస్కర్ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. కొత్తపేట లోని అంగన్వాడి కేంద్రం 4 నిర్వహణ లోపంపై ఐసిడిఎస్, సిడిపిఓ గజలక్ష్మి దృష్టికి తీసుకెళ్ళానన్నారు.

### మహిళా విద్యకు

# మార్గదర్శి సావిత్రిబాయి పూలే

### మహిళల జీవితాల్లో కాంతి జ్యోతి నింపిన ప్రేమ స్వరూపిణి
### వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యమని, మహిళల హక్కుల కోసం పోరాడిన భారతీయ తొలి ఉపాధ్యాయిని, కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే నేటితరానికి ఆదర్శమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పేరుకొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే మహిళా విద్య అభివృద్ధికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాజంలో మహిళలకు విద్య అందేలా ఎన్నో అవరోధాలను ఎదుర్కొని పోరాడిన మహానుభావురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహిళల సాధికారతకు, సమాన హక్కులకు ఆమె చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత మహిళను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ గౌరవకరమని, ఆమె చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, తెలుగుదేశం పార్టీ రామచంద్రపురం పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకె సాంబశివరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, యువ నాయకులు కుడుపూడి ఫణి తేజ, ప్రకాష్ కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న

# ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 సంవత్సరముల నుండి 15 సం ల వయస్సు ఉన్న బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా హెచ్ పి వి వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మరియు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి చే ప్రారంభించబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత నిచ్చి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని 14 సం.ల నుండి 15 సం.ల లోపు వయస్సు గల బాలికలందరూ ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని చెప్పారు.తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ 14 సం ల నుండి 15 సం ల వరకు వయస్సున్న బాలికలందరూ నిర్భయంగా ఏ అనుమానం లేకుండా ఈ వ్యాక్సిన్లు తీసుకోవాలని తద్వారా క్యాన్సర్ వ్యాధి రాకుండా రక్షణ పొందవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న,వలవల రాజా, గెడ్డం తిమ్మారావు, మట్ట వెంకటేశ్వరరావు,రాపాక వెంకటలక్ష్మి, పెందుర్తి అచ్యుత రామారావు, సీతానగరం మండల ప్రజా నాయకులు మరియు సీతానగరం పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ఏ వి కె చైతన్య, డాక్టర్ ఎం .శైలజా రాణి, మరియు పీహెచ్సీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు రద్దు

## ఎండల తీవ్రత వల్ల పిఠాపురంలో రద్దు నిర్ణయం - ఆవిర్భావ దినోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ

**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ పిఠాపురంలో నిర్వహించాలనుకున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రద్దుచేసారు. పిఠాపురం కేంద్రీకృతంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలనుకున్న ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మార్పులు చేసారు. ఈ వేడుకలను వికేంద్రీకృతం చేసారు. ఈ మేరకు జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ముందుగా ప్రకటించిన విధంగా ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరపాలి అనుకున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎండల తీవ్రత వల్ల పిఠాపురం ఆవిర్భావ సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. ఈసారి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లా కేంద్రాలు, నగరాలు, మండల కేంద్రాలు, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మార్చి 14 జన సైనికులకు, వీర మహిళలకు, పార్టీ నాయకులకు పండగ లాంటి రోజని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అన్నారు. జన సైనికులు, వీర మహిళలు, నాయకులు, ఉద్యమి సభ్యత్వం పొందిన వారి సమక్షంలో పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జరపాలని పవన్ కళ్యాణ్ సూచించారు. పార్టీ సైద్ధాంతిక బలం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఏ విధంగా ముందుకు వెళ్తుందో పార్టీ శ్రేణులకు, ప్రజలకు వివరించాలి అన్నారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని జనసేన అధినేత పిలుపును ఇచ్చారు. రక్తదాన శిబిరాలు, ఆహార వితరణ, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ దఫా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే రిపోర్టులను పరిగణనలోకి తీసుకొన్నారు. అందుకు అనుగుణంగా వేడుకల నిర్వహణ స్వరూపాన్ని మార్చారు. ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా కాకుండా జిల్లా, పట్టణం, నగర, మండల, గ్రామాల కేంద్రాల్లో నిర్వహించి కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. ఎక్కడికక్కడ స్థానికంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపును ఇచ్చారు.



**17వ వరకూ ఉద్యమి సభ్యత్వ నమోదు పొడిగింపు**

జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా నమోదవుతోంది. ఫిబ్రవరి 26వ తేదీన మొదలైన సభ్యత్వ నమోదు ఊరూరా సాగుతోంది. ఆంధ్ర ప్రదేశ్ తోపాటు పొరుగు రాష్ట్రాల్లో ఉన్న జనసేన శ్రేణులు, అభిమానులు సభ్యత్వాన్ని పొందుతున్నారు. ప్రవాస భారతీయులు ఆన్ లైన్ ద్వారా సభ్యత్వాన్ని తీసుకొంటున్నారు. సభ్యత్వ నమోదు గడువును 17వ తేదీ వరకూ పొడిగించాలని జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 10వ తేదీతో ముగుస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి సభ్యత్వ నమోదు గడువు పెంచాలనే విజ్ఞప్తులు కేంద్ర కార్యాలయానికి వచ్చాయి. అదే విధంగా పార్టీ శాసన సభ్యులు సైతం మరి కొద్ది రోజులు గడువు అవసరమని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలయ్యే సమయంలో అసెంబ్లీ ఉండటంతో ఆ సమావేశాల్లో నిమగ్నం అయ్యామని... సభ్యత్వ నమోదు ప్రక్రియని తమ నియోజక వర్గంలోని ప్రతి ఊరిలోనూ ఒక వేడుకలా కొనసాగిస్తామని విజ్ఞప్తి చేయడంతో 17 వ తేదీ వరకూ గడువు పొడిగించారు.

### పురుషులకు వంటల పోటీలు

# ఐసిడిఎస్ వినూత్న కార్యక్రమం..!

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 1975లో ప్రారంభమై ప్రపంచంలోనే అతిపెద్ద కమ్యూనిటీ ఆధారిత పథకంగా నిరంతరం కొనసాగుతున్న సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో (ఐసిడిఎస్ - ఇంటెగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్) సంప్రదాయానికి భిన్నంగా పురుషులకు కూడా వినూత్నంగా వంటల పోటీలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ శక్తి పథకంలో అంతర్భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20 వరకూ వివిధ అవగాహనా కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ వంటల పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగానే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని అంగన్వాడీ కేంద్రం 8 లో మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.వెంకటరజని ఆధ్వర్యంలో పురుషులకు, యువకులకు మంగళవారం ఈ వంటల పోటీలను నిర్వహించారు. ఈ సమాజంలో



పురుషుల భాగస్వామ్యం, ప్రవర్తనలో మార్పు ఆవశ్యకతను బలంగా తెలపడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ వంటల పోటీల్లో పలువురు పురుషులు, యువకులు పాల్గొని వంటలు చేసారు. వీరిలో గాది గణేష్, సుంకర దుర్గ, బొడ్డపాటి వీరదుర్గ ముగ్గురూ విజేతలుగా నిలిచారు. సమాజంలో పురుషులు, స్త్రీలూ సమానమనే భావన పెంపొందించడానికి, సమాజంలో ప్రధానంగా పురుష భాగస్వామ్యం, వారి ప్రవర్తనలో మార్పుల గురించి వారికి బి.వెంకటరజని వివరించారు. ఇంకా ఆమె మాట్లాడుతూ బేటీ బచావో -- బేటీ పడావో, బాల్య వివాహాలకు నో చెప్పండి, ఆడ బిడ్డను కాపాడండి -- చదివించండి , బాలికల విద్యను ప్రోత్సహిద్దాం, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం, అమ్మాయిలు మన సమాజానికి ఆస్తి వంటి విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం గురించి, గర్భంలో శిశు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని వెంకటరజని వివరించారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వెల్లడించారు. బాలికల విద్యాభివృద్ధి, సమాన హక్కుల కోసం, బాల్య వివాహాల నిర్మూలన కోసం సమాజం మొత్తం కలిసి పని చేయాలని పిలుపును ఇస్తూ బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112,181 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.వెంకటరజని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడి కార్యకర్తలు, వారి సహాయకులూ పాల్గొన్నారు.

# పాలలో కల్తీని గుర్తించండి. ఇలా..!

## అనుసరించాల్సిన పద్ధతులపై ప్రజల్లో అవగాహన - కరపత్రాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా చర్యలు
## ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి

**విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో పాలు, పాల పదార్థాల్లో కల్తీని ఇంట్లోనే సులువుగా గుర్తించవచ్చునని రాష్ట్ర ఆహార భద్రత శాఖ (ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్) వెల్లడించింది. ఏటవాలుగా పళ్లాన్ని ఉంచి పాల చుక్కను వదలినప్పుడు.. స్వచ్ఛమైన పాలు కనుక అయితే తెల్లటిధార మాదిరిగా దిగుతుంది. అదే నీరు కలిపిన పాలు అయితే తెల్లటి ధార లేకుండా త్వరగా కిందకి దిగిపోతుందని రాష్ట్ర ఆహార భద్రత శాఖ తెలిపింది. ఇలా చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా కల్తీ పాలు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండవచ్చు అని పేర్కొంది. రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తాజాగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశించిన ప్రకారం... కల్తీ పాలను ఎలా గుర్తించాలి అన్నదానిపై ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ) నీలకంఠారెడ్డి ఓ ప్రకటన జారీ చేశారు. ఫుడ్సేఫ్టీ అథారిటీ వారు పాలు, పాల ఉత్పత్తుల్లో జరిగే కల్తీని ఎలా కనుగొనాలో తెలియజేస్తూ పేర్కొన్న అంశాల( సూచనలు)ను కరపత్రాలు, పుస్తకాల రూపంలో ప్రచురించి విద్యా సంస్థలకు పంపిణీ చేయబోతున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. వీటి ద్వారా ముఖ్యకూడళ్లలోనూ ప్రచారాన్ని జరుపుతామన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

యూరియా లేదా డిటర్జంటు కలిసిందో లేదో తెలుసుకోవాలంటే..!

ఓ గ్లాసులో 10 ఎంఎల్ పాలు, 10 ఎంఎల్ నీటిని కలిపి, బాగా కదలించాలి. అప్పుడు పై భాగంలో మందమైన నురుగు ఏర్పడుతుంది. అదే స్వచ్ఛమైన పాలు అయినట్లయితే నురుగ రాదు. నురుగ వస్తే మాత్రం కల్తీ జరిగినట్లు గుర్తించాలి.

రంగు మారితే..!

మొక్కజొన్న లేదా ఇతర పిండి పదార్థాలను చిక్కదనం కోసం పాలలో కలిపారా లేదా తెలుసుకోవాలంటే ఓ గ్లాసులో పాలు తీసుకుని అయోడిన్ ద్రావణాన్ని రెండు, మూడు చుక్కలు కలిపినట్లయితే సదరు పాలు నీలం రంగులోనికి మారుతుంది. ఇదే జరిగితే కల్తీ జరిగినట్లు భావించాలి. రంగు మారకుండా ఉంటే వాటిని స్వచ్ఛమైన పాలుగా పరిగణించాలి. బంగాళాదుంప లేదా చిలకడ దుంప, ఇతర పిండి పదార్థాలను నెయ్యిలో కలిపారా? లేదా అని తెలుసుకోవడానికి ఒక స్పూన్ నెయ్యిని చిన్న గాజు గిన్నెలో వేయాలి. తర్వాత రెండు, మూడు చిన్న అయోడిన్ ఉప్పు ద్రావణాన్ని వేయాలి. అప్పుడు నెయ్యి నీలం రంగులోనికి మారితే కల్తీ జరిగినట్లు




భావించాలి.

నెయ్యిలో వనస్పతి, పామాయిల్ ఉందా లేదో తెలుసుకోవాలంటే. ఒక స్పూన్లో నెయ్యి తీసుకుని, కొంచెం చక్కెర కలిపి వేడిచేసినప్పుడు అది ఎరుపు లేదా పింక్ రంగులోనికి మారితే వనస్పతి కలిపినట్లు గుర్తించాలి. అలాగే గ్లాస్ వేడినీటిలో స్పూన్ నెయ్యిని వేస్తే.. ఒరిజనల్ నెయ్యి అయిన పక్షంలో అది పైన తేలుతుంది. వనస్పతి కలిపిన నెయ్యి అయితే చిన్నచిన్న ముద్దలుగా మారి కనిపిస్తుంది. లిఒక చుక్క నెయ్యిని అరచేతిలోనికి తీసుకుని గట్టిగా రుద్దినట్లయితే సువాసన రావాలి సువాసన రాకుండా ఉంటే నెయ్యిలో కల్తీ జరిగినట్లుగా భావించాలి.

కల్తీ గురించి తెలిస్తే ఫిర్యాదు చేయాలి!

కల్తీ ఘటనల గురించి తెలిస్తే 1800 425 3857 (టోల్-ఫ్రీ నెంబరు), 08645 297245 (ఐపీఎం ప్రధాన కార్యాలయం)కు తెలియజేయాలని డైరెక్టర్ నీలకంఠారెడ్డి సూచించారు

# కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో చేరండి

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర శిక్ష పథకంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 2026-2027 సంవత్సరానికి 6వ తరగతిలో 40, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ నందు 40 మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకోడాని



అంతర్జాల ఆధారిత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బడి బయట ఉన్న విద్యార్థులు, ఆనాధలు, తల్లి గాని తండ్రి గాని లేని పిల్లలకు, ఎస్సి, ఎస్టీ, ఓబీసీ, బిపిఎల్. విద్యార్థులకు మాత్రం ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతర్జాలంలో దరఖాస్తులను 12 నుంచి ఏప్రిల్ 1 వరకూ నమోదు చేసుకోవచ్చు. అర్హతగల ఎంపికైన విద్యార్థుల జాబితాను 13 న విడుదల చేస్తారు. పూర్తి వివరాలకు 7337526152, 95736 14894 సంప్రదించాలని, అర్హతగల విద్యార్థులు, తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రిన్సిపాల్ బి.బాలామణి కుమారి మంగళవారం సాయంత్రం విడుదల చేసిన మీడియా ప్రకటనలో కోరారు.

# వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈ నెల 12న జరగనున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండపేట నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట వైసీపీ ఇన్ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 12న మండపేట నియోజకవర్గంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామం, వార్డు, పట్టణం మరియు మండల కేంద్రాల్లో పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఎగురవేయాలన్నారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను శుభ్ర పరచి పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించాలని కోరారు. విజయలక్ష్మీ నగర్లోని ఆ పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసిన వేగుళ్ళ లీలా కృష్ణ

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జి.సాయి ప్రసాద్ని మంగళవారం రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జి.సాయిప్రసాద్కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా నీటిపారుదల రంగం పురోగతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రంలో సాగునీటి వనరుల అభివృద్ధి, రైతులకు మెరుగైన నీటి సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వారితో చర్చించారు.



# హెచ్పీవీ వ్యాక్సినేషన్తో గర్భాశయ ముఖ క్యాన్సర్కు స్వస్తి : చైర్ పర్సన్ రాణి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గర్భాశయ ముఖ క్యాన్సర్ను నిరోధించే హెచ్పీవీ వ్యాక్సిన్ను 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలు తప్పని సరిగా వేయించుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు.స్థానిక గొల్లపుంత అర్బన్ హెల్త్ సెంటర్లో మంగళవారం నిర్వహించిన హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భాశయ ముఖ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్పీవీ టీకాలను ఉచితంగా అందిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 14 నుంచి 15 ఏళ్లలోపు తమ బాలికలకు ఈ టీకాలు వేయించాలని కోరారు. అనంతరం టీకాలు వేయించుకున్న బాలికలకు ధ్రువపత్రాలను చైర్పర్సన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బివిపి ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత


**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ లోని కన్నమ్మతల్లి గుడి ప్రక్కన ఉన్న శ్రీనివాస రామానుజం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, కొలమానాలు, హాల్ టికెట్ పౌచులు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సామాగ్రిని పి.సుబ్రహ్మణ్యం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ విశాఖ ప్రాంత అధ్యక్షుడు పి.వి.ఎస్. నారాయణ, కోశాధికారి కె. శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవి లత, పి. వంశీ, మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు తమ ప్రసంగాల ద్వారా విద్యార్థులను ఉత్సాహపరిచి, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే విధంగా పలు సూచనలు చేసి ప్రోత్సహించారు.



**ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో..**

స్థానిక ఇన్నిసపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పరీక్ష అట్టలు, పెన్నులు, కొలమానాలు మరియు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పి. సుబ్రహ్మణ్యం స్పాన్సర్గా సామాగ్రిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో వంశీ, కె.వి. సుబ్రహ్మణ్యం, భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ అధ్యక్షుడు ఎస్. గణేష్, కోశాధికారి కె.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో పలువురు కుటుంబాలను రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు.17 వార్డు ఇంచార్జ్ దుగ్గిరాల గణేష్, 15 వార్డు ఇంచార్జ్ రామోజు కృష్ణ కుమారుడు అభిరామ్ లు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారి వద్దకు వెళ్ళి ఆరోగ్య క్షేమ సమాచారాని తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యాన్నిచ్చి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో కౌన్సిలర్, ఆర్ టి ఐ నియోజకవర్గం కన్వీనర్ మందపల్లి రవికుమార్, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, జిల్లా వైసిపి పార్టీ ప్రధానకార్యదర్శి యర్రగుంట మణికంఠ కుమార్, రాష్ట్ర వైసిపి కార్మికశాఖ విభాగం జాయింట్ సెక్రటరీ శెట్టి నాగేశ్వరరావు, వ్యవసాయ సొసైటీ మాజీ చైర్మన్ పెంకె గంగాధరం, వైసిపి ఐటి విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, బిల్లగుర్తి అంజిబాబు లు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

బుధవారం, 11 మార్చి 2026
www.viswamvoice.com






# 14 ఏళ్ళ బాలికలకు హెచ్‌పివి టీకాను వేయించాలి

**వ్యాక్సిన్ వేయించుకుని కేన్సర్ బారి నుండి రక్షణ పొందాలి**
**మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధన్యత - కేన్సర్ నివారణకు ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్**
**హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాజమహేంద్రవరం శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) అన్నారు. స్థానిక 13వ డివిజన్ అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్ నందు మహిళలలో వచ్చే గర్భాశయ ముఖద్వారా కేన్సర్ నివారణకు ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అబేద్కర్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డెవలప్ మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ చెల్లుబోయిన సూర్యానారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడానికి ఎంతో ఖరీదైన హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఉచితగా వేయించడమే నిదర్శనమన్నారు. ప్రాణాంతకమైన కేన్సర్ బారిన మహిళలు పడకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టారన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 15సంవత్సరాలు లోపుగల ఆడిపిల్లలు 3,45,000 మందికి ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుంద న్నారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపుగల ఆడ పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ వేయించి కేన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 14లక్షల మంది కేన్సర్ మహమ్మారి బారిన పడుతున్నారని తెలిపారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలంటే ఇంటిని నడిపే మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. అందుచేతనే ప్రధాని మోడీ మహిళలు కేన్సర్ బారిన పడకుండా ఉండటానికి ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారని అన్నారు. గర్భాశయ ముఖద్వారా కేన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించే మొదటి దశ డ్రైవ్ మూడు నెలలు పాటు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటిలోని 14ఏళ్ళు నిండి 15ఏళ్ళు లోపు ఆడబిడ్డలందరికీ వ్యాక్సినేషన్ చేయించే బాధ్యతను తీసుకోవాలని పిలుపుని చ్చారు. రెండోవ దశలో వ్యాక్సినేషన్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కిఫీ హాస్పటల్ అధినేత, వైద్య నిపుణులు డాక్టర్ కరుటూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేన్సర్ అనేది ఒక వైరస్ అని దీనికి వాక్సిన్‌ను తీసుకురావడం చాలా ఆనందకరమ న్నారు. వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలకు లోనుకాకుండా 14ఏళ్ళు నిండి 15ఏళ్ళ లోపు ఆడిపిల్లలు అంతా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవాలన్నారు. చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వాక్సిన్ అందుబాటులో ఉన్నందున అర్హులందరూ వ్యాక్సిన్ వేయించుకుని కేన్సర్ బారినుండి రక్షణ పొందాలని సూచించారు. వాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. వాక్సిన్ వేయించుకోవడానికి ధైర్యంగా ముందుకు రావాలన్నారు. సందర్భంగా వాక్సిన్ వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీదేవి, ఎంహెచ్ ఓ డాక్టర్ వినూత్న, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, మాజీ కార్పొరేటర్‌లు కప్పల వెలుగు కుమారి, కూరాకుల తులసీ, సింహానాగమణి, 14వ డివిజన్ ఇన్‌చార్జి ఈతలపాటి రవికుమార్, బొర్రా చిన్ని, బంగారు నాగేశ్వరరావు, దాస్యం ప్రసాద్, మాలే విజయలక్ష్మి, కొడమళ్ళ శ్రీనివాస్, కరణం లక్ష్మి నాయుడు, అప్పరీ, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఆశావర్కర్‌లు, ఎఎనఎంలు, లబ్ధిదారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

# కల్తీ పాలు సంఘటనపై సీబీఐ దర్యాప్తు జరగాలి

**కల్తీ పాల బాధితులను పరామర్శించిన మాజీ ఎంపీ మార్గాని భరత్ వైయస్ జగన్ మిల్క్ ప్రొక్యూర్ మెంట్ యాక్ట్ తీసుకొచ్చారు**
**ల్యాబ్ నుంచి రిపోర్టు రావడానికి ఇంకాఎంత సమయం కావాలి - బాధితుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్థానిక బొల్లినేని ఆసుపత్రిలో కల్తీ పాల బాధితులను వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాన భరత్ రామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రిలో కూటమి నేతల తీరు ఆకతాయితనంగా ఉంది, నాటకాలు వేయడానికి టైం ఉంది కానీ... కానీ సంఘటన జరిగి ఇన్నిరోజులు అయినా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్,పవన్ కళ్యాణ్,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ గాని కల్తీ పాల బాధితుల గురించి పట్టించుకునే పరిస్థితి లేదు ,పరామర్శించడానికి కూడా రాకపోవడం చాలా బాధాకరం, కల్తీ పాలు తాగి మరణాలు 11వరకు ఇప్పటికీ మరణించారు,సంఘటనలో దీనీలో కొన్ని కేసులను యాక్సిడెంట్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు, బాధితుల శాంపిళ్ళు నేషనల్ ఫోరెన్సిక్ లేబరేటరీకి ఎందుకు పంపలేదు. ఈ వ్యవహారాన్ని సిబిఐకి అప్పగించాలి, అప్పుడే నిజానిజాలు వెల్లడవుతాయి, పోలీసులు అన్ని రకాలుగా దర్యాప్తు జరపాలి,160 లీటర్ల పాలు తీసుకొస్తే 20 కుటుంబాలు మాత్రమే ఎందుకు ఎఫెక్ట్ అయ్యాయి, పాలలో యూరియా కలిసిందా...ఫార్మాలిన్ కలిసిందా...గిట్టని వాళ్లు ఏమైనా పురుగుల మందు కలిపారా...అన్న విషయాలు ఇప్పటివరకు స్పష్టం కాలేదు, బాధితు కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది ఈ ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైయస్ జగన్ మిల్క్ ప్రొక్యూర్ మెంట్ యాక్ట్ తీసుకొచ్చారు.ఆ చట్టాన్ని ఎందుకు ఇంప్లిమెంట్ చేయడం లేదు. చిన్నారులు సైతం మృతువుతో పోరాడుతున్నారు, మీ కుటుంబంలోనే ఇటువంటి ఘటనలు జరిగితే ఇలాగే ప్రవర్తిస్తారా.. పురుగుల మందు తీసుకుని ఎలా తీవ్ర అనారోగ్యం ఎదుర్కొంటారో అటువంటి పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయి. ల్యాబ్ నుంచి రిపోర్టు రావడానికి వారాలు ఎందుకు పడుతుంది. ప్రభుత్వం హైడ్రామా ఆడుతోంది. ఈ ఘటన జరిగిన తర్వాత హెరిటేజ్ అడ్వర్టైజ్మెంట్లు విపరీతంగా పెంచింది ఈ ఘటనను కూడా వ్యాపారం కోసం వాడుకుంటున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ కల్తీయే. చంద్రబాబు హయాంలో తిరుమల లడ్డుకు సంబంధించి ఫ్లేవర్ ఎన్ హ్యాన్సర్స్ కొన్నారు... అది కల్తీ కాదా. బాధిత కుటుంబాలకు 25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలి. ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయిస్తాం. తనికీల గురించి ప్రశ్నిస్తేఫుడ్ సేఫ్టీ అధికారులు మాకు స్టాఫ్ లేరని చెప్పడం దారుణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ రుడా ఛైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు.

# పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం, పురుషోత్తపట్నం గ్రామాలకు చెందిన పలువురికి శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. నీలం శెట్టి రాఘవకు రూ.34214/- లు, పిచ్చుకుల ప్రభాకర్ రావు కు రూ. 30,786/- లు,పిసిని మహాలక్ష్మికి 16,000/- లు,పదిలం వెంకటేష్ కు రూ.57,8161/- లు,కోడి బత్తుల దుర్గాప్రసాద్ కు రూ.22,000/- ల చెక్కులను స్వయంగా అందజేశారు. వీరి వెంట జనసేన, తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

### పేరాంటాలమ్మ తల్లిని
# దర్శించుకున్న ఆదివాసీ నాయకులు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, దేవీ పట్నం మండల పరిధిలోని దేవారం గ్రామంలో స్వయంభువుగా వెలసిన గ్రామ దేవత ఐన పేరాంటాలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ పేరాంటాలమ్మ పండుగను గ్రామస్తులందరు ఘనంగా నిర్వహించి ఘనంగా నైవేద్యం సమర్పించిన అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,ఆదివాసీ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మడకం బంగారు బాబు,సొసైటి మాజీ చైర్మన్ తుర్రం రామకృష్ణ దొర,బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీనివాసు,భారత్ ఆదివాసీ పార్టీ రంపచోడవరం డివిజన్ ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్, పూసం పార్వతి, అన్నిక సావిత్రి, అన్నిక సీతారామ్, అంబటి హనుమంతు మొదలైన వారు పాల్గొన్నారు.

### విద్యార్థిలనుకు పరీక్ష కిట్లు పంపిణీ చేసిన
# ఏటిఎం, ఏపీ ఆదివాసీ జేఏసీ



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏ.టి.ఏ) మండల నాయకులు చిచ్చడి శేషారావు,సోడే కన్నం రాజు, ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర మొదలైన పెద్దలు ఆధ్వర్యంలో విద్యార్థినులకు పరీక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం,దేవారం గ్రామ పంచాయతీ పరిధిలోని దామనపల్లి (ముసిని గుంట) బాలికలు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న 51 మంది విద్యార్థినులకు పరీక్ష కిట్లు అందజేశామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు దేవీపట్నం మండలాన్ని రాష్ట్రస్థాయిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏ.టి.ఏ) మండల నాయకులు చిచ్చడి శేషరావు,సోడే కన్నం రాజు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి మీ యొక్క విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలకు,మీ యొక్క తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు విద్యార్థినులకు ఉద్దేశించి మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.చంద్రకళ,ఏ. వెంకటేశ్వర రావు(శ్రీనివాస్),కె. రణదీప్, పి.బుల్లియ,టి. సాంబశివ రావు,శివరామకృష్ణ, ఆదివాసీ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మడకం బంగారు బాబు, సొసైటీ మాజీ చైర్మన్ తుర్రం రామకృష్ణ దొర,కారం రంగారావు దొర (రిటైర్డ్ ఉద్యోగి జల వనరుల శాఖ),చవలం విద్యాసాగర్ భారత్ ఆదివాసీ పార్టీ డివిజన్ ప్రసార కార్యదర్శి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో జనసేనలోకి భారీ చేరికలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరం గ్రామానికి చెందిన పలువురు వైసిపి ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలన జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వీరికి కండువాలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. మెండ్రు పిచ్చయ్య, మెండ్రు అబద్ధం,మెండ్రు కాపు, మెండ్రు సుబ్బారావు, మెండ్రు చిన్ని, మెండ్రు వీరన్న, మెండ్రు నూక పండు, మెండ్రు రాజు, మెండ్రు వీర బాబు,నండూరి శ్రీను నండూరి నూకరాజు, ఉమ్మిడిశెట్టి కృష్ణ, ఉమ్మిడిశెట్టి అయ్యప్పతదితరులు జనసేన పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.


### 14 నుండి 15ఏళ్లలోపు ఆడపిల్లలకు
# సర్వేకల్ వ్యాక్సిన్ తప్పనిసరి : బత్తుల

**బత్తుల చేతుల మీదుగా వైద్యులకు చిరు సత్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** 14 నుండి 15 ఏళ్ల లోపు ఆడ పిల్లలందరూ తప్పనిసరిగా సర్వేకల్ వ్యాక్సిన్ వేయిం చుకోని గర్భాశయ క్యాన్సర్ నుండి విముక్తి పొందాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం కోరుకొండ, కోటి కేశవరం, రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో వైద్యాధికారులు డాక్టర్ జ్ఞానచంద్ర, డాక్టర్ కిల్లి కృష్ణవేణి ఆధ్వర్యంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చేతుల మీదుగా 14 సంవత్సరాల ఆడపిల్లలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్ పి వి వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా బత్తుల, బొడ్డు మాట్లాడుతూ మహిళలలో ఏడాదికి లక్ష మందికి పైబడి గర్భాశయ క్యాన్సర్ సోకుతుందని, దీంతో సుమారు 75వేల మంది ఏడాదికి మరణిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ క్యాన్సర్ ను రూపుమాపి మరణాలను తగ్గించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం 14 నుండి 15 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తుందన్నారు. బయట దీని ధర సుమారుగా ఎనిమిది వేలరూపాయలు ఉంటుందన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల ఆడవాళ్లకు భవిష్యత్తులో గర్భాశయ కాన్సర్ నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్ఞానచంద్ర, కిల్లి కృష్ణవేణి, తెలుగుదేశం పార్టీ నాయకులు తేలగంశెట్టి శ్రీనివాస్, దూది కాంతారావు, రొంగల శ్రీనివాస్, పితా శ్రీను, మద్దిపాటి రజిని, అడపా సుధీర్, కోర్పు నరేంద్ర, కొయ్యే సామ్యూల్, గుర్రం వీరలక్ష్మి శ్రీనివాస్, వుల్లి సత్యనారాయణ, పీత సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, యర్రం శెట్టి పోలారావు, అడపా శ్రీనివాస్, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, కోరుకొండ, కోటి కేశవరం వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

# మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్న రుడా ఛైర్మన్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం గ్రామ దేవత శ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రుడా ఛైర్మన్ తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ తల్లిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెడ్డం తిమ్మారావు,కాండ్రు శేఖర్, వలవల రాజా,పెందుర్తి అచ్చియ్య,సంగాన చిన పోశియ్య,ఓబులు లేని కృష్ణ చైతన్య,కొండ్రపు ముత్యాలు పెందుర్తి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

### భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో
# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**పలువురికి చిరు సత్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంతో పాటు రాజకీయాల్లోనూ ముఖ్య భూమిక పోషించే విధంగా 33శాతం రిజర్వేషన్ తీసుకొస్తుందని శ్రీ సీతారామభార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవాసమాఖ్య అధ్యక్షులు పరస శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవాసమైక్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బ్రాహ్మణ మహిళలు నూతనంగా నిర్మిస్తున్న బ్రాహ్మణ సేవసమైక్య భవనాన్ని పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవాసమైక్య ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సంఘసభ్యులు చర్చించారు. సంఘం ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భాగవతుల శారదా దేవి,సామవేదం రమణి,గోపవచ్చుల భాస్కర సత్యవతి,తణుకు వెంకట రామలక్ష్మి,చైనీ సుజాత,సాహు సునీతలకు పూలమాలలు వేసి సాల్వలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు పరస శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు కాశీపట్టణ నరసింహమూర్తి, పాలకోడేటి గణపతి, గోవర్ధనం రవీంద్ర,కొక్కిరిగాడు దుర్గా ప్రసాద్,నాగులపాటి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది అనంతరం సిపిఐ ఎంఎల్ పార్టీ మండల కమిటీ ఎన్నిక : రాష్ట్ర కార్యదర్శి పలివెల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రం సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యాలయం నందు రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న సిపిఐ ఎంఎల్ పార్టీ సీతానగరం మండల కార్యవర్గాన్ని రద్దు చేయడం జరిగిందని అన్నారు. ఉగాది అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పార్టీలో ఉత్సాహంగా పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని వారికి ఐడికార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. నూతన కార్యవర్గ కమిటీ అనంతరం భూ పోరాటాలు ఉధృతంగా కొనసాగుతాయని తెలియజేశారు. పెరిగిన నిత్యవసర వస్తువులపై,పెరిగిన డీజిల్,పెట్రోల్,గ్యాస్ వంటి ధరలపై నిరసన దీక్షలు కొనసాగుతాయని అన్నారు. పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క మహిళకు 1500 రూపాయలు ఇస్తానని చెప్పి గడిచిన రెండు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా ఏ ఒక్క మహిళకు ఇవ్వలేదని పలివెల ఆరోపించారు. నిరంతర ప్రక్రియగా పెన్షన్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి ఒంటరి మహిళలకు,అంగవైకల్యం కలిగిన వారికి నూతన పెన్షన్లు నమోదు చేసుకోవడానికి ఎలాంటి అవకాశం లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారని అన్నారు. మేము అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని మాయ మాటలు చెప్పి నేటికీ పేద ప్రజలకు ఎలాంటి ఓసి బిసి ఎస్సీ ఎస్టీ సబ్సిటీ కలిగిన కార్పొరేషన్ లోన్లు లేకుండా చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తామని చెప్పి హడావిడి చేసిన కూటమి నాయకులు నేటికీ నూతన గృహాల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ లేదని అన్నారు. గత ప్రభుత్వం కొందరి పేదవారికి ఇంటి పట్టాలు ఇవ్వగా మేము అధికారంలోకి వస్తే మూడు సెంట్లు కలిగిన ఇంటి స్థలాన్ని చూపిస్తామని చెప్పిన నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయిందని అన్నారు. ఇలాంటి విషయాలను అసెంబ్లీలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ప్రశ్నించకపోవడం చాలా బాధాకరమని దుయ్యబట్టారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు లబ్ది కలిగే విషయాలను లేవనెత్తుతున్నారే తప్ప పేదవాడు గురించి ఆలోచించిన దాఖలాలు ఏ ఒక్క నాయకుల్లోని కనిపించడం లేదని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా,కాకినాడ జిల్లా,పోలవరం జిల్లాల్లో ప్రతీ మండలం నుండి సిపిఐ ఎంఎల్ పార్టీ తరఫున నాయకులు,కార్యకర్తలు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కమిటీలు వేయడం జరిగిందని,నిబద్ధతతో పని చేయని మండలాల్లో నూతన కమిటీలను వేస్తున్నామని అన్నారు. అభివృద్ధిని చూపించకుండా స్థానిక ఎన్నికల్లో కూటమి నాయకులు పేద ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని అన్నారు. పేద వారికి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భూములను,మిగులు భూములను నిరుపేదలకు పంచుతామని చెప్పి కాలయాపన చేస్తున్నారని అన్నారు. అందుకు కూటమి ప్రభుత్వం జిల్లా అధికారులను స్పందించకుండా చేస్తున్నారని ఆరోపించారు. భూస్వాములకే కూటమి ప్రభుత్వం వత్తాసు పలుకుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పేద ప్రజలు ముందుకు,నోటుకు అమ్ముడుపోకుండా విద్యావంతులైన నిజాయితీ కలిగిన వారిని ఎన్నుకోవాలని అన్నారు. ఓటు అనే ఆయుధంతో మన హక్కులను సాధించుకోవడం మనకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని ఈ సందర్భంగా పలివెల గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# రచ్చ లేపిన పవన్ కళ్యాణ్ హుక్ స్టెప్పు..

## కాలరే ఎత్తరా సాంగ్ ప్రోమో అదిరిపోయిందిగా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయంతో పాటు సినిమాల్లోనూ బిజీగా ఉన్నారు. ఓ వైపు డిప్యూటీ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టి బిజీ ఉంటూనే.. సమయం దొరికినప్పుడు సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇక ఇప్పుడు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో రాబోతున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్ లో గబ్బర్ సింగ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా ఎంత పెద్ద విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక ఇప్పుడు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నారు హరీష్ శంకర్. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ మూవీలో మరోసారి పవన్ కళ్యాణ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నాడు. తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా నుంచి మూడో సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో పవన్ సరసన రాశీ ఖన్నా, శ్రీలీల హీరోయిన్లు గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్స్, గ్లింప్స మెగాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా పవన్ కళ్యాణ్ హుక్ స్టెప్పు ఇప్పుడు రచ్చ లేపింది. ఎక్కే, దిగే కిక్కులోన దక్కేదేముందే..అరె సచ్చే దాకా కిక్కే ఉండాలే..ఎక్కి తొక్కేటోల్లే ఉంటే తగ్గేదేముందే.. నెగ్గే దాకా తిక్కే ఉండాలే.. అంటూ సాంగ్ ప్రమోను విడుదల చేశారు. ఈ సాంగ్ థియేటర్స్ లో రచ్చ రచ్చ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. దేవీ శ్రీ సంగీతం అందించిన ఈ సాంగ్ ను రామ్ మిరియాల ఆలపించారు. కాసర్ల శ్యామ్ రచించారు. గత ఏడాది రెండు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. హరిహరవీరమల్లు సినిమాతో పాటు ఓజీ సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ఓజీ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కాగా హరిహరవీరమల్లు సినిమా అనుకున్నంతగా ఆకట్టుకోలేకపోయింది. దాంతో ఇప్పుడు ఉస్తాద్ భగత్ సింగ్ పై భారీ అంచనాలు పెట్టుకున్నారు అభిమానులు. మార్చ్ 19 ఉస్తాద్ సినిమా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

సినీ వాయిస్ CINEMA

ఆ ఇన్‌స్టా అకౌంట్ నుంచి

# నటి లావణ్య త్రిపాఠికి వేధింపులు..

## సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు



సామాన్యులకే కాదు సెలబ్రెటీలకు సైతం సోషల్ మీడియాలో వేధింపులు ఆగడం లేదు. తాజాగా సినీ నటి లావణ్య త్రిపాఠి సైతం సోషల్ మీడియాలో వేధింపులకు గురైనట్టు తెలిపారు. ఈ విషయంపై ఆమె హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ ఇన్‌స్టా అకౌంట్ నుంచి అసభ్యకర మెసెజ్‌లు, కామెంట్స్ వుస్తున్నట్టు ఆమె కంప్లైంట్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా యాప్ ఇన్‌స్టా గ్రామ్ వేదికగా తమ పరువుకు భంగం కలిగించే విధంగా కొందరు అసభ్యకర మెసెజ్‌లు చేస్తున్నారని.. వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని సినీ నటి లావణ్య త్రిపాఠి కొణిదెల హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఘటనపై సెక్షన్ 67తో పాటు పలు సెక్షన్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నటి లావణ్య త్రిపాఠి ఫిర్యాదు ప్రకారం.. పర్పుల్ క్రెయాన్ అనే ఇన్‌స్టా గ్రామ్ అకౌంట్ నుంచి తనకు వ్యక్తిగత దూషణలు, అసభ్యకర కామెంట్స్ వస్తున్నాయని.. ఇవి తమ పరువును భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ అకౌంట్ నుంచి కావాలనే తనను తన ఫ్యామిలీ టార్గెట్‌గా మెసేజెస్, కామెంట్స్ చేస్తున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కన్నారు. గత కొన్ని రోజులుగా ఈ వేధింపులు కొనసాగుతున్నాయని ఆమె ఆరోపించారు. తన గౌరవాన్ని దెబ్బతీసేలా కొన్ని పోస్ట్‌లకు కామెంట్స్ పెడుతున్నారని.. తన వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను ప్రశ్నించేలా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇలా ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తూ ఇన్‌స్టా అకౌంట్‌ను రన్ చేస్తున్న వ్యక్తులను పట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ అకౌంట్ నుంచి ఇప్పటి వరకు చేసిన పోస్ట్‌లు, మెసేజ్‌లు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది.

క్రీడా వాయిస్

# అర్ష్‌దీప్ సింగ్‌కు ఐసీసీ షాక్..

## వరల్డ్ కప్ ఫైనల్ గెలిచినా తప్పని భారీ జరిమానా



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించి భారత్ సంబరాల్లో మునిగిపోయిన వేళ, టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఐసీసీ షాకిచ్చింది. మైదానంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అతనికి భారీ జరిమానా విధించింది. టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించి భారత్ సంబరాల్లో మునిగిపోయిన వేళ, టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్?కు ఐసీసీ షాకిచ్చింది. మైదానంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అతనికి భారీ జరిమానా విధించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ ప్రవర్తన ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అతిక్రమించినట్లు తేలింది.

**అసలేం జరిగింది? :** న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ క్రీజులో ఉండగా, అర్ష్‌దీప్ బంతిని ఫీల్డ్ చేసి నేరుగా వికెట్ల వైపు విసిరాడు. అయితే ఆ త్రో అనవసరంగా మిచెల్ శరీరానికి బలంగా తగిలింది. ఇది ప్రమాదకరంగా ఉండటంతో పాటు క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని ఐసీసీ భావించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఆర్టికల్ 2.9 (అంతర్జాతీయ మ్యాచ్‌లలో వేరే ఆటగాడిపైకి బంతిని లేదా ఇతర వస్తువులను ప్రమాదకరంగా విసరడం) కింద ఇది లెవల్ 1 నేరంగా పరిగణించబడింది.

**శిక్ష, స్పందన :** ఈ తప్పిదానికి గాను అర్ష్‌దీప్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత అర్ష్‌దీప్ తన తప్పును అంగీకరించి డారిల్ మిచెల్‌కు క్షమాపణలు చెప్పాడు. "నా త్రో కొంచెం రివర్స్ స్వింగ్ అయ్యి అతనికి తగిలింది, నేను కావాలని చేయలేదు" అని అర్ష్‌దీప్ వివరణ ఇచ్చాడు. మిచెల్ కూడా దీనిని స్పోర్టివ్‌గా తీసుకుని అర్ష్‌దీప్‌తో షేక్ హ్యాండ్ చేయడం విశేషం.

# వరల్డ్ కప్ ఫైనల్ హీరోకు తప్పని తిప్పలు..

## తన జీతం కోసం సోషల్ మీడియాలో పోరాటం



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరులో భారత్ చేతిలో న్యూజిలాండ్ ఓడిపోయినా, ఆ జట్టు ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్ తన పోరాట పటిమతో అందరినీ ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో 4 ఓవర్లు వేసి 46 పరుగులు ఇచ్చినప్పటికీ, 3 కీలక వికెట్లు తీసి టీమిండియాను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. అయితే ప్రస్తుతం నీషమ్ తన ఆట కంటే కూడా సోషల్ మీడియాలో చేసిన ఒక ఘాటు కామెంట్‌తో ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచాడు. తనకి రావాల్సిన జీతం ఇవ్వలేదంటూ ఒక క్రికెట్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను బహిరంగంగా నిలదీశాడు నీషమ్.

**అసలేం జరిగింది? :** నేపాల్ ప్రీమియర్ లీగ్‌లోని పోఖారా ఎవెంజర్స్ అనే జట్టుకు జేమ్స్ నీషమ్ గత ఏడాది ప్రాతినిధ్యం వహించాడు. తాజాగా జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో నీషమ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి కేవలం ఒక్క పరుగు మాత్రమే ఇచ్చాడు. దీనిని అభినందిస్తూ పోఖారా ఎవెంజర్స్ టీమ్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. "మా ఆటగాడు నీషమ్ అద్భుతం" అంటూ పొగిడేసింది. అయితే ఈ పోస్ట్ చూసిన నీషమ్‌కు కోపం వచ్చింది. వెంటనే ఆ పోస్ట్ కింద.. "సరే బానే ఉంది.. ఇప్పుడు ఆటగాళ్ల బకాయిలు చెల్లించండి" అంటూ రిప్లై ఇచ్చాడు.

**సోషల్ మీడియాలో రచ్చ :** నీషమ్ చేసిన ఈ ఒక్క కామెంట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఒక అంతర్జాతీయ స్టార్ ఆటగాడికి కూడా సరైన సమయానికి డబ్బులు ఇవ్వలేదంటే ఆ లీగ్ పరిస్థితి ఏంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. గత సీజన్‌లో నీషమ్ పోఖారా ఎవెంజర్స్ తరపున 4 మ్యాచ్‌లాడి 99 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు తీశాడు. ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయినా, నీషమ్ తన వంతు కృషి చేశాడు. కానీ ఆడినందుకు ఇవ్వాల్సిన పారితోషికాన్ని మాత్రం మేనేజ్‌మెంట్ ఎగ్గొట్టినట్లు ఈ కామెంట్‌తో స్పష్టమైంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచరుం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు | వాహనాల అమ్మకం | ట్యూషన్ & & విద్య | ఉద్యోగ అవకాశాలు | సర్వీసు& రిపేర్లు | ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com